




బృందలోలుడి బ్రహ్మారథం



మహా రథోత్సవంలో జన సందోహం



ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు

- వైభవంగా రాఘవేంద్రుడి మహా రథోత్సవం
- భక్తులతో పులకరించిన తుంగా తీరం
- లక్షలాదిగా తరలివచ్చిన భక్తులు
- ఆకట్టుకున్న నృత్యాలు
- రథోత్సవాల్లో పాల్గొన్న ప్రముఖులు



బృందావనానికి హారతులు ఇస్తున్న పీఠాధిపతి

తుంగాతీరం ఆధ్మాత్మికతతో ఉప్పొంగింది. ఇష్టదైవం రాఘవేంద్రుడి వైభవాన్ని చూసి భక్తులు పరవశించిపోయారు. ఆధ్యాత్మిక క్షేత్రం మంత్రాలయం భక్తజనసంద్రమైంది. గుండెల నిండా భక్తి నింపుకుని దేశం నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివచ్చారు. 'మూలరామా విజయథే.. తుంగా తీరా నివాసా గోవిందా గోవిందా.. జయహో గురు రాఘవేంద్ర విజయహో పూజ్యాయ రాఘవేంద్రాయ నమో నమః' అంటూ భక్తుల రాఘవరాయల నామస్మరణతో శ్రీమఠం మారుమోగింది. రాఘవేంద్రస్వామి 353వ సప్తరాత్రోత్సవాల్లో ఐదవ రోజు అత్యంత ముఖ్యమైన ఉత్తరాధనలో భాగంగా గురువారం మహా రథోత్సవం వైభవంగా సాగింది.



మంత్రాలయం, ఆగస్టు 22: జగద్గురు రాఘవేంద్రస్వామి సప్తరాత్రోత్సవాల్లో భాగంగా గురువారం ఉత్తరాధన పురస్కరించుకుని మహా రథోత్సవం కన్నులపండువగా జరిగింది. శ్రీమఠం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు ఉదయం సుప్రభాత సేవతో ఉత్సవాలకు అంకురార్పన పలికారు. వజ్ర వైడూర్య రత్నాలతో పొదిగిన హారం, బంగారు ఆభరణాలతో అలంకృతుడైన ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలను సంస్కృత పాఠశాల వరకు ఊరేగించి తిరిగి శ్రీమఠానికి తీసుకువచ్చారు. అనంతరం ఉత్సవమూర్తికి మఠం పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు పూజలు చేసి మహామంగళహారతులు ఇచ్చారు. వసంతోత్సవంలో భాగంగా మఠం అర్చకులు, సిబ్బంది, భక్తులపై రంగులు చల్లుతూ ఉత్సాహంగా ముందుకు సాగారు. ఉత్సవమూర్తిని రథంపైకి అధిష్టిస్తుండగా.. లక్షలాది మంది భక్తులు జయహో గురు రాఘవేంద్ర.. విజయహో అంటూ పెద్ద ఎత్తున జయధ్వానాలు పలికారు. మహారథంపై నుంచి భక్తులకు పీఠాధిపతి అభివాదం చేశారు. శ్రీమఠం మహాముఖద్వారం, మధ్వమార్గ్ కారిడార్ నుంచి మహారథం ముందుకు సాగుతుండగా చండీవాయిద్యాలు, నాధాహారం, కోలాట నృత్యాలు, బీరప్పడోలు, భజన మండల భక్తి పాటలు, మంగళవాయిద్యాలు, దేవతామూర్తుల వేషధారణలు ఆకట్టుకున్నాయి. రాఘవేంద్ర సర్కిల్ వద్ద యువత బాణాసంచా పేలుస్తూ నృత్యాలు చేశారు. అనంతరం శ్రీమఠానికి చేరుకున్న మహారథం నుంచి ఉత్సవమూర్తిని బృందావనం ముందు ఉంచి పూజలు చేశారు. ఈ ఉత్సవంలో పండిత కేసరి విద్వాన్ రాజా ఎస్.గిరిరాజాచార్, మఠం దివాన్ సుజీంద్రాచార్, ఆనంద తీర్థాచార్, గౌతమాచార్, శ్రీమఠం ఉత్తర భారతదేశ విచారణ కర్త శ్రీనివాస్ కస్బే, ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి, అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహమూర్తి, ఈఈ సురేష్ కోనాపూర్, ఏఈలు బద్రినాథ్, శ్రీహరి, వ్యాసరాజాచార్, బిందు మాధవ్, సూపరింటెండెంట్లు అనంతపురాణిక్, రవి కులకర్ణి, జేపీ స్వామి, విజయేంద్రాచార్, ద్వారపాలక అనంతస్వామి, ప్రకాష్ ఆచార్, జయతీర్థాచార్, వాధిరాజాచార్‌లు పాల్గొన్నారు.

హిందువులపై దాడి హేయం

పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు

మంత్రాలయం: బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు చేయడం అమానుషమని, దీనిని ప్రతి భారతీయుడు ఖండించాల్సిన అవసరం ఉందని పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు అన్నారు. మహారథంపై నుంచి ఆయన దివ్య సందేశాన్ని భక్తులకు వినిపించారు. రాఘవేంద్రస్వామి సజీవంగా యోగనిద్రలో ఉంటూ భక్తులకు కోరిన కోర్కెలు తీర్చే దైవంగా ఉన్నారన్నారు. స్వామివారు బృందావనం నుంచి భక్తుల యోగ క్షేమాలు తెలుసుకుంటూ వారి ప్రతి కోరికను తీరుస్తారన్నారు. దేశంలో ప్రజలంతా శాంతితో ఐకమత్యంతో ఉండాలని కోరారు. సకాలంలో వర్షాలు కురిసి రైతులు సస్యశ్యామలంగా ఉండాలన్నారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దేశాన్ని, రాష్ట్రాంతో పాటు ప్రజలకు అన్ని విధాలుగా మేలు చేయాలని పూజలు చేస్తున్నట్లు తెలిపారు. ఉత్సవాలకు లక్షలాది మంది భక్తులు తరలిరావడం చూస్తుంటే.. ప్రతి ఇంటా ఆరాధ్య దైవంగా రాఘవేంద్రుడు కొలువై ఉన్నారని రుజువైందని అన్నారు. ఎంతో మంది దాతలు, భక్తులు ఇచ్చిన సహకారంత ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టి భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. తెలుగు, కన్నడ, హిందీ భాషల్లో పీఠాధిపతి ప్రసంగిస్తుండగా భక్తులు శ్రద్ధగా ఆలకించారు. ఇదిలా ఉండగా శ్రీమఠం ఉద్యోగులకు 22వ పీఆర్సీ, 2 డీఏలు ఇస్తున్నట్లు పీఠాధిపతి తెలిపారు. కాంట్రాక్టు, ఎన్ఎంఆర్ సంభావన కింద పని చేసే వారికి రెండు నెలల జీతం పెంచుతున్నట్లు ప్రకటించారు. మంత్రాలయంలో డిగ్రీ, విశ్వవిద్యాలయం, ఇంజనీరింగ్ కాలేజీలు త్వరలో ఏర్పాటు చేస్తామని తెలిపారు.



రథం ఎదుట కోలాహలం



భక్తులపై రంగులు చల్లి వసంతోత్సవం



అశ్వ విన్యాసం

రథోత్సవంలో పాల్గొన్న ప్రముఖులు: రాఘవేంద్ర స్వామి మహారథోత్సవ వేడుకల్లో కర్ణాటక హైకోర్టు జడ్జి జస్టిస్ రామచంద్ర ఉదార్, మైసూరు మహారాజు యదువీర్ కృష్ణదత్త చామరాజ వడియార్ తదితరులు పాల్గొన్నారు. ఎస్పీ జి. బిందుమాధవ్ ఆదేశాల మేరకు 325 మంది పోలీసులతో భారీ బందోబస్తు నిర్వహించారు. యోగీంద్ర కళామండపంలో గురువారం రాత్రి బెంగుళూరు చెందిన ప్రభాత్ కళా బృందం నృత్యరూపకం, ధార్వాడకు చెందిన పండిత్ వెంకటేశ్ కుమార్ హిందుస్థాని వోకల్ సంగీతం భక్తులను అలరించింది.



రథోత్సవంలో కర్ణాటక కళాకారుల ప్రదర్శన



సంప్రదాయ వస్త్రధారణలో కోలాటం ఆడుతున్న చిన్నారులు



రథంపై నుంచి పీఠాధిపతి సుబుదేంద్రతీర్థుల ఆశీస్సులు

జిల్లాలో పోలీసుల తనిఖీలు



ప్రజలతో మాట్లాడుతున్న పోలీసులు

నంద్యాల క్రైం, ఆగస్టు 22: ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా నాలుగు సబ్ డివిజన్లలో పోలీస్ అధికారులు, సిబ్బంది విజిబుల్ పోలీసింగ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విధుల్లో భాగంగా గురువారం ముమ్మర తనిఖీలు నిర్వహించారు. దాడుల్లో భాగంగా సివిల్ పోలీసులు ఏడు సారా కేసులు నమోదు చేసి 58 లీటర్ల సారాను, 129 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకోవడంతోపాటు నాటుసారా బట్టీలపై దాడులు చేసి 800లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు పోలీసులు తెలిపారు. సెబ్ అధికారులు సారాపై ఒక కేసు నమోదు చేసి 50లీటర్ల సారాను స్వాధీనంచేసుకొని బట్టీలపై దాడులు చేసి 800లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు తెలిపారు. మద్యం అక్రమంగా తరలిస్తున్న వారిపై ఐదు కేసులు నమోదు చేసి 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. డోన్ పట్టణంలోని వెంకటనాయనిపల్లె రైల్వేగేట్ వద్ద పేకాట ఆడుతున్నవారిపై దాడిచేసి నలుగురిని అరెస్టుచేసి వారి నుంచి రూ.16,500 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మట్కారాయుళ్లపై దాడి చేసి రెండు కేసులు నమోదు చేసి రూ.18,676 స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. డ్రంకెన్ డ్రైవ్‌లో భాగంగా తొమ్మిది మందిపై కేసులు నమోదు చేశామన్నారు. అలాగే బహిరంగంగా మద్యం తాగుతున్న వారిపై 85కేసులు నమోదు చేయడంతో పాటు ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు భద్రతానియమాలు పాటించనివారిపై ఎంవీఐ చట్టం ప్రకారం 316 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఒక లారీని సీజ్‌చేసి 30 టన్నుల ఇసుకను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. పీడీఎస్ బియ్యంను అక్రమంగా తరలిస్తున్న ఆటోతో పాటు 36 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వివరించారు.

మెరుగైన సేవలు అందించండి: కలెక్టర్ రాజకుమారి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల (కల్చరల్), ఆగస్టు 22: రెవెన్యూశాఖ ప్రజలకు మెరుగైన సర్వీసులు అందిస్తే గ్రీవెన్స్ తగ్గుతాయని కలెక్టర్ రాజకుమారి రెవిన్యూ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో రెవిన్యూ అంశాలపై రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో జేసీ విష్ణుచరణ్, డీఆర్వో పద్మజ, ఆర్డీఓలు మల్లికార్జునరెడ్డి, మహేశ్వరరెడ్డి, ఎం. దాసు అన్ని మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికకు, మ్యుటేషన్, భూ అక్రమణలకు అనేక ఫిర్యాదులు వస్తున్నాయని అన్నారు. ల్యాండ్ లిటికేషన్లలో అక్రమాలకు పాల్పడినట్లు వెల్లడైతే అధికారులపై తీవ్ర కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వచ్చేనెల రెండోవారం నుంచి రెవెన్యూ సదస్సులు జరుగనున్నాయని, ఇందుకు సంబంధించిన ఇనాం, ఆర్ఎస్ఆర్, అడంగల్ తదితర రెవెన్యూ రికార్డులను అందుబాటులో ఉంచుకోవాలని అన్నారు.

మున్సిపల్ కమిషనర్ల బదిలీలు

కర్నూలు న్యూసిటీ/ఆళ్లగడ్డ, ఆగస్టు 22: ఉమ్మడి జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లను బదిలీ చేస్తూ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ రాష్ట్ర ప్రత్యేక కార్యదర్శి అనిల్ సింఘాల్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆదోని మున్సిపల్ కమిషనర్‌గా పని చేస్తున్న కె. రామచంద్రారెడ్డిని భీమవరానికి, గూడూరు మున్సిపల్ కమిషనర్‌గా పని చేస్తున్న దివాకర్‌రెడ్డిని రాయదుర్గానికి బదిలీ చేశారు. అదేవిధంగా ఆళ్లగడ్డ మున్సిపల్ కమిషనర్ ఏవీ రమేష్‌బాబును కర్నూలు నగర పాలక సంస్థ సూపరింటెండెంట్‌గా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ముమ్మడివరం మున్సిపల్ కమిషనర్‌గా పని చేస్తున్న కె.వెంకట్రామిరెడ్డిని ఆళ్లగడ్డ మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ చేశారు. అయితే ఆదోని, గూడూరు మున్సిపాలిటీలకు కమిషనర్లను నియమించలేదు. ఇదిలా ఉండగా ఆదోని మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి ఆరు నెలల్లోపే బదిలీ కావడం చర్చనీయాంశంగా మారింది.

మల్లన్న హుండీ ఆదాయం రూ.3.22 కోట్లు



కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది, శివసేవకులు

శ్రీశైలం, ఆగస్టు 22: శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లకు భక్తులు సమర్పించిన కానుకలను గురువారం లెక్కించారు. లెక్కింపును ఆలయంలోని చంద్రావతి కల్యాణమండపంలో నిర్వహించారు. భక్తులు గత 20 రోజుల్లో సమర్పించిన కానుకల ద్వారా రూ.3,22,53,862 నగదు వచ్చింది. అలాగే ఈ హుండీలో 150.1 గ్రాముల బంగారం, 5.250 కిలోల వెండి లభించాయి. అదేవిధంగా 746 యుఎస్ఏ డాలర్లు, 50 యూఏఈ దిర్హమ్స్, 20 యూరోలు, 26 సింగపూర్ డాలర్లు, 70 యూకే పౌండ్స్, 125 కెనడా డాలర్లు, 50 ఆస్ట్రేలియా డాలర్లు మొదలైన విదేశీ కరెన్సీ ఈ హుండీ లెక్కింపులో లభించాయి. హుండీ ఆదాయాన్ని పటిష్టమైన భద్రతాఏర్పాట్లు, సీసీ కెమెరాల నిఘా నడుమ లెక్కించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు, డిప్యూటీ ఈఓ రమణమ్మ, పర్యవేక్షకులు, సిబ్బంది, శివసేవకులు తదితరులు పాల్గొన్నారు.

చెంచుల జీవన ప్రమాణాలు మెరుగుపడాలి

జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకట శేషాద్రి



మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకట శేషాద్రి

ఆత్మకూరు, ఆగస్టు 22: చెంచుల జీవన ప్రమాణాలు పెరిగేలా ప్రభుత్వ శాఖలు బాధ్యతగా వ్యవహరించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకట శేషాద్రి సూచించారు. గురువారం ఆత్మకూరు పట్టణంలోని నాగలూటి, ఇందిరేశ్వరం గూడేల్లో జిల్లా ప్రధాన న్యాయమూర్తి కబర్ధి ఆదేశాల మేరకు ఆయా శాఖల అధికారులతో కలిసి అవగాహన సదస్సులను నిర్వహించారు. ఈ సందర్భంగా లీలా వెంకట శేషాద్రి మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెంచుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలపై అవగాహన పెంచుకుని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రత్యేకించి రేషన్‌కార్డు, ఆధార్, ఆరోగ్య, కుల ధ్రువీకరణ పత్రం, తదితర సర్టిఫికెట్ల మంజూరుకు ఆయా శాఖలు చెంచులకు పూర్తిస్థాయిలో సహకరించాలని విజ్ఞప్తి చేశారు. మహిళా చట్టాలు, లీగల్ సర్వీసెస్ యాక్ట్ 1987 ద్వారా ఉచిత న్యాయ సలహాలను అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం వైద్యశాఖ సహకారంతో అక్కడ వైద్యశిబిరాన్ని నిర్వహించి వైద్యపరీక్షలు నిర్వహించడంతో పాటు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. అలాగే ఆయా గూడేల్లో ఉన్న పాఠశాలలను, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి అక్కడి సిబ్బంది తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మోహన్‌కుమార్, ఆర్డీఓ కార్యాలయ ఏఓ శ్రీనివాసులు, ఎస్ఐ వెంకటనారాయణరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ హరికృష్ణ, ఎఫ్ఆర్ఓ కృష్ణప్రసాద్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ సువర్చల, వైద్యులు పవన్‌కుమార్, గోపాల్‌నాయక్, ఎఫ్ఎస్ఓ మగ్బూల్‌బాషా, ఐటీడీఏ ఏపీఓ నాగార్జున, సామాజిక కార్యకర్త జుల్ఫికర్ అలిఖాన్, పారా లీగల్ వలంటీర్ బలరాముడు తదితరులు ఉన్నారు.

అక్రమ లే అవుట్లపై అధికారుల కన్నెర్ర

- అనుమతులు తెచ్చుకొని లేఅవుట్లు వేసుకోండి
- కుడా వైస్ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 130 అక్రమ లే అవుట్ల గుర్తింపు



అక్రమ లే అవుట్ల కూల్చివేత సందర్భంగా బందోబస్తు నిర్వహిస్తున్న సీఐ కృష్ణయ్యయాదవ్



అక్రమ లేఅవుట్లను తొలగిస్తున్న కుడా అధికారులు

బనగానపల్లె, ఆగస్టు 22: అక్రమ లే అవుట్లలో ప్లాట్లు కొంటే ప్రజలు ఇబ్బందులు పడతారని కుడా వైస్ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. గురువారం బనగానపల్లె, భానుముక్కల, మిట్టపల్లె, హుసేనాపురం, యనకండ్ల గ్రామాల్లో అక్రమంగా వేసిన 40 లే అవుట్లను ఎక్స్‌కవేటర్లతో కూల్చివేసే పనులు ప్రారంభించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు అక్రమ లే అవుట్లను జిల్లా పంచాయతీ అధికారి మంజులవాణి, కూడా ప్లానింగ్ అధికారి సంధ్య, కూడా సిబ్బంది వచ్చి కూల్చివేశారు. ఈ సందర్భంగా కుడా వైస్ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ కర్నూలు అర్బన్ డెవలప్‌మెంట్ పరిధిలో ఉమ్మడి కర్నూలు జిల్లాలో 53 మండలాల్లో ఉన్న అనధికారి లే అవుట్లపై చర్యలు తీసుకోవడానికి గత మూడు నెలల నుంచి స్పెషల్ డ్రైవ్ చేపట్టాం. ఉమ్మడి జిల్లాల్లో 130 అక్రమ లే అవుట్లను గుర్తించినట్లు తెలిపారు. లే అవుట్ల యజమానులకు చట్టప్రకారం అనుమతులు తీసుకోవాలని గతంలో నోటీసులు అందించాం. అయినా వారు పట్టించుకోవడం లేదు. దీంతో ప్రభుత్వం అక్రమ లే అవుట్లపై కొరడా ఝుళిపించినట్లు తెలిపారు. గత మూడు నెలలుగా ఉమ్మడి కర్నూలు జిల్లాలోని అక్రమ లే అవుట్ల యజమానులకు తమ సిబ్బంది చట్టప్రకారం అనుమతులు తీసుకోవాలని పలుసార్లు నోటీసులు ఇచ్చామన్నారు. లే అవుట్ల యజమానులకు నోటీసులు ఇస్తున్నప్పటికీ వారి నుంచి ఎలాంటి సమాధానం రావడం లేదన్నారు. అందుకే జిల్లా వ్యాప్తంగా అక్రమ లేఅవుట్లను కూల్చివేస్తున్నట్లు తెలిపారు. లేఅవుట్లు వేసిన యజమానులు ప్లాట్ల రూపంలో అమాయక ప్రజలకు అమ్ముకుంటున్నారన్నారు. లే అవుట్లలో కనీస వసతులు కల్పించడం లేదన్నారు. బనగానపల్లె మండలంలో 40 అక్రమ లే అవుట్లను గుర్తించామన్నారు. వాటి యజమానులకు నోటీసులు ఇచ్చినా స్పందించకపోవడంతో అక్రమ లే అవుట్లను కూల్చివేస్తున్నట్లు తెలిపారు. మొదటి దశలో నోటీసులు ఇచ్చామని, స్పందించపోవడంతో కూల్చివేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా లే అవుట్ల యజమానులు తప్పనిసరిగా కూడా అనుమతులు తీసుకొని వ్యాపారాలు చేసుకోవాలని సూచించారు. కూల్చివేసిన లే అవుట్లలో యజమానులు అభివృద్ధి పనులు చేసినట్లయితే కేసులు నమోదు చేస్తామన్నారు. ప్రభుత్వ సూచనల మేరకు లే అవుట్ యజమాని, సర్వేనంబరు పేపర్ నోటిఫికేషన్ ఇవ్వనున్నట్లు తెలిపారు. అక్రమ లే అవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసి ప్రజలు మోసపోవద్దని సూచించారు. ఉమ్మడి జిల్లాలో కర్నూలు, నంద్యాల, బనగానపల్లె పాణ్యం, ఎమ్మిగనూరు, ఆదోని, నందికొట్కూరు తదితర ప్రాంతాల్లో 50 లే అవుట్లు కూల్చివేసినట్లు ఆయన పేర్కొన్నారు. లే అవుట్లలో పదిశాతం గ్రామ పంచాయతీకి పార్కులు నిర్మించుకోవడానికి స్థలం ఇవ్వాలన్నారు. లే అవుట్లు వేయాలంటే ఖచ్చితంగా కూడా అనుమతి తప్పని సరి అని కాని గ్రామ పంచాయతీలకు లే అవుట్లను ఆమోదించే అధికారం లేదన్నారు. ఎన్ని రాజకీయ వత్తిళ్లు ఉన్నా అక్రమ లే అవుట్లను కూల్చివేయడం ఖాయమని కుడా వైస్ ఛైర్మన్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బనగానపల్లె సీఐ కృష్ణయ్యయాదవ్, నందివర్గం ఎస్ఐ వెంకటసుబ్బయ్య, పోలీసు సిబ్బంది, గ్రామ పంచాయితీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల

కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 22: పంచాయతీరాజ్ అండ్ గ్రామీణాభివృద్ధి శాఖ నుంచి 15వ ఆర్థిక సంఘం నిధులు ఉమ్మడి జిల్లాకు రూ.25.63 కోట్లు మంజూరైనట్లు జడ్పీ సీఈఓ జి. నాసర రెడ్డి తెలిపారు. గురువారం జడ్పీలో ఆయన మాట్లాడుతూ జిల్లా పరిషత్‌తో పాటు ఉమ్మడి జిల్లాలోని 53 మండలాల పరిషత్‌కు సంబంధించిన బ్యాంకు ఖాతాల్లో జమచేసినట్లు ఆయన వివరించారు. జిల్లా పరిషత్‌కు బేసిక్ గ్రాంట్ రూ.5,12,38,547, టైడ్ గ్రాంట్ రూ.7,65,58,105 కలిపి మొత్తం రూ.12,80,96,652, అదే విధంగా మండల పరిషత్‌లకు బేసిక్ గ్రాంట్ రూ.5,12,87,973, టైడ్ గ్రాంట్ రూ.7,69,32,385 కలిపి మొత్తం రూ.12,82,20,358 విడుదల చేసినట్లు సీఈఓ తెలిపారు. బేసిక్ గ్రాంట్ నిధులు కేవలం గ్రామాల్లో పారిశుధ్యానికి, టైడ్ గ్రాంట్ నిధులు నిర్మాణాలు, మరమ్మత్తులకు వినియోగించుకోవాలని ఆయన సూచించారు. ప్రభుత్వం విడుదల చేసిన నిధులను ప్రభుత్వ నిబంధనల మేరకు ఖర్చు చేయాలని ఎంపీడీఓలను ఆదేశించారు.

ఐదు టిప్పర్లు సీజ్

కర్నూలు(అర్బన్), ఆగస్టు 22: అక్రమంగా ఖనిజాన్ని తరలిస్తున్న ఐదు టిప్పర్లు సీజ్ చేశామని గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. గురువారం బనగానపల్లె నుంచి మహారాష్ట్రకు తరలిస్తున్న డోలమైట్ ఖనిజాన్ని ఓర్వకల్లు పోలీస్టేషన్ పరిధిలో తనిఖీల్లో సీజ్ చేశారు. ఇతర అవసరాల కోసం గ్రావెల్, చిప్స్ తరలిస్తున్న మరో 3 లారీలను పాణ్యం, ఉల్లిందకొండ, కర్నూలు తాలుకా పోలీస్టేషన్‌కు తరలించారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్లు మురహరి, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డుకు దరఖాస్తులు

కర్నూలు(ఎడ్యుకేషన్), ఆగస్టు 22: సెప్టెంబరు 5న గురు పూజోత్సవాన్ని పురస్కరించుకుని ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డీఈవో శామ్యూల్ గురువారం తెలిపారు. జిల్లాలో 15 సంవత్సరాలు సర్వీసు పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 25వ తేదీలోపు మండల, డివిజన్ విద్యాశాఖ అధికారుల ద్వారా జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సమర్పించాలన్నారు.

బాలుడి మృతదేహం లభ్యం

నంద్యాల (నూనెపల్లె), ఆగస్టు 22: నంద్యాల మండలం రాయమాల్‌పురం గ్రామ సమీపంలో బుధవారం కుందూ నదిలో గల్లంతైన బాలుడి మృతదేహం లభించిందని తాలూకా అర్బన్ సీఐ అసార్ బాషా గురువారం తెలిపారు. రాయమాల్‌పురం గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు కుందూ నదిలో బుధవారం చేపలు పట్టేందుకు వెళ్లారు. ఈ క్రమంలో రాయమాల్‌పురం గ్రామానికి చెందిన షేక్షావలి(15), ప్రమాదవశాత్తు కుందూలో గల్లంతు కావడంతో గాలింపు చర్యలు చేపట్టారు. గురువారం గల్లంతైన బాలుడి మృతదేహం లభించింది. పోలీసులు మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల సర్వజన వైద్యశాల మార్చురీకి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పజెప్పినట్లు సీఐ తెలిపారు.

అడవి పందుల వేటగాళ్ల వల్లే విద్యుత్ కోతలు

ఆత్మకూరు విద్యుత్ ఏడీ రమేష్



సింగరాజుపల్లి గ్రామ శివారులో విద్యుత్ వైర్లు, ఉచ్చు సామగ్రిని స్వాధీనం చేసుకున్న విద్యుత్ అధికారులు, సిబ్బంది

కొత్తపల్లి, ఆగస్టు 22: రాత్రి వేళల్లో అడవి పందుల కోసం ఉచ్చులు వేసే వేటగాళ్లే విద్యుత్ కోతలకు కారణమని ఆత్మకూరు విద్యుత్ ఏడీ రమేష్ అన్నారు. గురువారం విద్యుత్ ఏడీ మాట్లాడుతూ కొత్తపల్లి మండలంలో గత పది రోజులుగా ఉన్నట్టుండి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగడంతో క్షేత్రస్థాయిలో గ్రామాల్లో ఏడీ, ఏఈలతో పాటు పరిశీలించామన్నారు. అడవి పందుల వేట కోసం రాత్రివేళల్లో పంట పొలాల్లో విద్యుత్ వైర్లు అమర్చి నేరుగా మెయిన్‌లైన్‌కు వేటగాళ్లు వైర్లు తగిలిస్తున్నట్లు గుర్తించామన్నారు. దీని వల్ల పంట పొలాలకు, ఇండ్లకు విద్యుత్ సరఫరా నిలిచిపోతున్నదని అన్నారు. శివపురం, గుమ్మడాపురం, సింగరాజుపల్లి, ఎర్రమఠం, పాతమాడుగుల, కపిలేశ్వరం, సంగమేశ్వరం గ్రామాల్లో అడవి పందుల కోసం వేటగాళ్లు విద్యుత్ వైర్లు అమర్చుతున్నారని అన్నారు. ఇలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అంగన్‌వాడీ సెంటర్‌లో దారుణం

- పిల్లాడు అల్లరి చేశాడని వాతలు పెట్టిన ఆయా
- షోకాజ్ నోటీసులు జారీ చేసిన ఐసీడీఎస్ సీడీపీవో



ఆయా పెట్టిన వాతలతో గాయపడిన అబ్దుల్ సమీర్

ఆత్మకూరు, ఆగస్టు 22: ఆత్మకూరు పట్టణంలోని ఓ అంగన్‌వాడీ సెంటర్ దారుణం చోటుచేసుకుంది. పిల్లాడు అల్లరి చేస్తున్నాడన్న కారణంతో శేషమ్మ అనే ఆయా వాతలు పెట్టింది. ఈ సంఘటన గురువారం ఆలస్యంగా వెలుగు చూసింది. పట్టణంలోని రాజావీధికి చెందిన వలి కుమారుడైన మూడేళ్ల అబ్దుల్ సమీర్ 22వ అంగన్‌సెంటర్‌లో శిశువిద్యను చదువు తున్నాడు. బుధవారం సెంటర్ అంగన్ వాడీ వర్కర్ ఖాదర్‌బీ మాతా శిశుసంరక్షణ పథకంలో భాగంగా గర్భిణీలు, బాలింతల ఇళ్ల వద్దకు క్షేత్ర పర్యటనకు వెళ్లడంతో సెంటర్ ఆయా శేషమ్మ పిల్లలను పర్యవేక్షించింది. ఆ సమయంలో అబ్దుల్‌సమీర్ అల్లరి చేస్తుండటంతో ఆయా సలాకీ కాల్చి చేతికి, కాలికి వాతలు పెట్టింది. చర్మం పొంగడంతో బాలుడి తల్లిదండ్రులు శేషమ్మపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆత్మకూరు ఐసీడీఎస్ సీడీపీవో లీలావతి గురువారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఆయా శేషమ్మను విధుల నుంచి తొలగించనున్నట్లు సీడీపీవో లీలావతి వెల్లడించారు.

మూడు తులాల బంగారం చోరీ

ఆదోని, ఆగస్టు 22: ఆదోని పట్టణం తిరుమల నగర్‌లో బుధవారం రాత్రి నాలుగు ఇళ్లల్లో దొంగలుపడ్డారు. తిరుమల నగర్ కాలనీలోని బేల్దారి రామమూర్తి బుధవారం తన ఇంటికి తాళం వేసి బంధువులు ఊరికి వెళ్లాడు. ఇదే అదనుగా భావించిన దుండగులు బుధవారం రాత్రి ఇంటికి ఉన్న కాలాన్ని పగలగొట్టి లోపలకు చొరబడ్డారు. బీరువాలో ఉంచిన మూడు తూలాల బంగారు ఆభరణాలతో పాటు, రూ. 2వేలు నగదు, 10 గ్రాముల వెండిని దొంగిలించారు. ఇదే కాలనీలో మరో మూడు ఇళ్లల్లో కూడా దొంగలు చొరబడ్డారు. ఆ ఇళ్ల యజమానులు ఊర్లో లేకపోవడంతో ఇతరులు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. వారు వచ్చాక వివరాలు తెలుస్తాయని స్థానికులు అంటున్నారు. తమకు ఫిర్యాదులు చేయలేదని త్రీ టౌన్ సీఐ రామలింగప్ప తెలిపారు.

రైతు ఆత్మహత్య

ఎమ్మిగనూరు రూరల్, ఆగస్టు22: పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన బుధవారం రాత్రి పొద్దుపోయాక మల్కాపురం గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన ఉరుకుందయ్య(40) తనకున్న మూడు ఎకరాల్లో పత్తి, మిరప పంటలను సాగు చేసి రూ.9.50 లక్షల అప్పులపాలయ్యాడు. దీంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు ఎమ్మిగనూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. మృతుడికి భార్య, ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ అరెస్టు

ఆదోని రూరల్ ఆగస్టు 22 : ఆదోని మండలం పెద్దతుంబళం గ్రామానికి చెందిన లక్ష్మిని పోలీసులు అరెస్టు చేశారు. గురువారం తన నివాసంలో కర్ణాటక మద్యాన్ని విక్రయిస్తుండగా, అదుపులోకి తీసుకొని ఆమె వద్ద నుంచి 90మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పెద్దతుంబళం ఎస్.ఐ తెలిపారు.

భర్తపై ఫిర్యాదు.. పెద్దతుంబళంకు చెందిన నాగమ్మ భర్త వీరేష్‌పై ఫిర్యాదు చేసింది. రోజు మద్యం సేవిస్తూ, అదనపు కట్నం తేవాలని మానసికంగా, శారీరకంగా వేధిస్తుండడంతో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ తెలిపారు.

పెళ్లి పందిరిలో విషాదం

- తెల్లవారితే పెళ్లి
- వరుడి తండ్రి మృతి



బొత్తల శ్రీను (ఫైల్)

శిరివెళ్ల, ఆగస్టు 22: పెళ్లి పందిరిలో విషాదం చోటు చేసుకుంది. కొన్ని గంటల వ్యవధిలో కొడుకు పెళ్లి చూడాల్సిన తండ్రి అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ ఘటన గురువారం జరిగింది. శిరివెళ్లకు చెందిన బొత్తల శ్రీను కుమారుడి వివాహాన్ని ప్రకాశం జిల్లా గిద్దలూరులో నిర్వహించేందుకు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు బుధవారం రాత్రి గిద్దలూరుకు బయలుదేరి వెళ్లారు. బుధవారం అర్ధరాత్రి శ్రీను కల్యాణ మండపంలో అనారోగ్యానికి గురై తుది శ్వాస విడిచాడు. దీంతో వధూవరుల కుటుంబాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. శ్రీను మృతదేహాన్ని స్వగ్రామమైన శిరివెళ్లకు తరలించి గురువారం అంత్యక్రియలు నిర్వహించారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

నంద్యాల (నూనెపల్లె), ఆగస్టు 22: నంద్యాలలోని రైతు నగరం సమీపంలో విద్యుదాఘాతంతో సంతోష్ (20) అనే యువకుడు మృతి చెందినట్లు తాలూకా పోలీసులు తెలిపారు. పట్టణంలోని నడిగడ్డకు చెందిన శ్రీనివాసులు కుమారుడు సంతోష్ భవన నిర్మాణ కార్మికుడిగా పని చేస్తున్నాడు. గురువారం రైతు నగరంలో పని చేస్తుండగా ఓ యంత్రానికి సంబంధించి కరెంట్ వైర్లను సంతోష్ ప్రమాదవశాత్తు తగలడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. చికిత్స నిమిత్తం నంద్యాల సర్వజన వైద్యశాలకు తరలించారు. యువకుడు అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం గదికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉన్నట్లు తాలూకా పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

నందికొట్కూరు, ఆగస్టు 22: నందికొట్కూరు ఇనుప సామాన్ల దుకాణంలో పని చేస్తున్న మహబూబ్‌బాషా (28) అనే వ్యక్తి విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. ఈ ఘటన గురువారం జరిగింది. పగిద్యాల మండలం లక్ష్మాపురం గ్రామానికి చెందిన మహబూబ్‌బాషా నందికొట్కూరు పట్టణంలోని ఓ ఇనుప సామాన్ల దుకాణం వద్ద పని చేసున్నాడు. పని చేస్తున్న సమయంలో అతని కాలికి విద్యుదాఘాతం తగిలి అక్కడిక్కడే కుప్పకూలి పడిపోయాడు. అక్కడ పని చేసే సిబ్బంది ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రికి చేరుకున్న తర్వాత ఆయన మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. తండ్రి చిన్న మహబూబ్‌బాషా ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్నట్లు సీఐ ప్రవీణ్ కుమార్‌రెడ్డి తెలిపారు.

కూలిన మట్టి మిద్దెలు



కూలిన మట్టిమిద్దె

వెల్దుర్తి, ఆగస్టు, 22: వెల్దుర్తి పట్టణంలో బుధవారం కురిసిన వర్షానికి రెండు మట్టి మిద్దెలు కూలిపోయాయి. 7వ వార్డు కొలంబావి వీధిలో నివాసం ఉంటున్న ఆదిలక్ష్మి కుటుంబం బయట గదిలో నిద్రిస్తుండగా వంటగది కూలింది. అదే విధంగా 13వ వార్డు రైల్వేస్టేషన్ వీధిలో ఇబ్రహీమ్ కుటుంబం బయటగదిలో నిద్రిస్తుండగా లోపలిగది కూలిపోయింది. ఈ రెండు కుటుంబాలు బయటి గదిలో నిద్రిస్తుండడంతో ప్రాణనష్టం జరగలేదు. వీరిరువురు కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.1లక్ష నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

ఐచర్ డ్రైవర్‌పై కేసు నమోదు

వెల్దుర్తి, ఆగస్టు, 22: ద్విచక్ర వాహనదారుడిని ఐచర్ వాహనం ఢీ కొన్న ఘటనలో ఐచర్ వాహన డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అశోక్ గురువారం తెలిపారు. 20వ తేది డోన్ నుంచి కర్నూలుకు బైక్‌పై వెళుతున్న వంశీకృష్ణ నాయక్‌కు జాతీయ రహదారి-44 పెట్రోల్ బంకు సమీపంలో గొర్రెల మంద అడ్డు వచ్చింది. ఆగిన బైకును ఐచర్ వాహనం వెనుక నుండి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో వంశీకృష్ణకు గాయాలయ్యాయి. వెంటనే గొర్రెల కాపలాదారులు క్షతగాత్రుడిని హైవే అంబులెన్స్‌లో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వంశీకృష్ణ అన్న హరిచరణ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఐచర్ డ్రైవర్ పరారీలో ఉన్నాడు.

తాగునీటి సరఫరా బిల్లుల చెల్లింపులో జాప్యం

బేతంచెర్ల నగర పంచాయతీలో తారతమ్యం



బేతంచెర్ల నగర పంచాయతీ కార్యాలయం ఇదే

బేతంచెర్ల, ఆగస్టు 22: బేతంచెర్ల నగర పంచాయతీ కార్యాలయంలోని ఓ కీలక అధికారి అనుమతి లేనిదే ఏ పని జరగడం లేదు. కింది స్థాయి సిబ్బంది నుంచి ఉన్నత స్థాయి అధికారి వరకు అందరి మీద ఆయన పెత్తనం నడుస్తోంది. కార్యాలయంలో ఏ పని చేయాలన్నా చేయి తడపనిదే ఒక్క పని కూడా జరగడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత నాలుగేళ్లుగా పనిచేస్తున్న ఓ కీలక అధికారి వ్యవహార శైలిపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల ప్రభావంతో నవంబరు నుంచి భూగర్భ జలాలు బోర్లలో అడుగంటడంతో నగర పంచాయతీ ప్రజలకు తాగునీటి ఎద్దడి ఏర్పడింది. అందుకుగాను పట్టణ ప్రజల దాహార్తి తీర్చడానికి రోజువారిగా రూ.2,400 ప్రకారం ఒక్కొక్క ట్రాక్టర్‌కు రోజు బాడుగ కింద జూన్ వరకు మూడు నెలలు రాత్రి పగలు నీటి ట్యాంకర్లను తెప్పించి ప్రజల దాహార్తిని తీర్చారు. అయితే ట్రాక్టర్ల యజమానులకు బిల్లుల కేటాయింపులో తారతమ్యం చూపుతున్నారు. కొంత మందికి 8 నెలలైనా బిల్లులు ఇవ్వలేదు. దీంతో ట్రాక్టర్ల యజమానులు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. అయినా పట్టించుకునే పరిస్థితి ఆయనకు లేదని ట్రాక్టర్ల యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంజనీరింగ్ డిపార్టుమెంటు నగర పంచాయతీ ప్రజలకు తాగునీరు సరఫరా చేసిన నీటి ట్యాంకర్ల యజమానుల పేర్లను కూడా ఓ కౌన్సిలర్ చెప్పినట్లు ప్రకటిస్తున్నారని వాపోతున్నారు. ఓ కౌన్సిలర్‌తో సదరు అధికారి సన్నిహితంగా ఉంటూ తాగునీటి సరఫరా బిల్లులను తారుమారు చేస్తున్నట్లు ట్రాక్టర్ల యజమానులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా తమకు న్యాయంగా రావాల్సిన బిల్లులు చెల్లించాలని కోరుతున్నారు. ఈ విషయంపై నగర పంచాయితీ కమిషనర్ రమేష్ బాబు వివరణ కోరగా నగర పంచాయతీ పరిధిలో ఎండాకాలంలో తాగునీటి ఎద్దడి ఎదుర్కొంటున్న ప్రజల కోసం ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేశామన్నారు. గత ప్రభుత్వంలో కొంత మంది నీటి ట్రాక్టర్ల ట్యాంకర్ల యజమానులకు బిల్లులు మంజూరయ్యాయని, మరికొంతమందికి మంజూరు కాలేదన్నారు. బిల్లులు మంజూరైతేనే తాము కూడా ఇవ్వగలమన్నారు.

గొలుసు దొంగల హల్‌చల్

కర్నూలు, ఆగస్టు 22: తాలుకా పోలీస్‌స్టేషన్ పరిధిలో బాలాజీనగర్‌లో గొలుసు దొంగలు హల్‌చల్ చేశారు. గురువారం సాయంత్రం రత్నమ్మ అనే మహిళ మెడలో నుంచి గొలుసు తెంపుకునే ప్రయత్నం చేశారు. రత్నమ్మ తన భర్తతో కలిసి బైక్‌పై వెళ్తుండగా.. వీరి బైక్‌ను ఇద్దరు ఆగంతకులు అనుసరించారు. ఈ క్రమంలో దుండగులు ఆమె మెడలోని గొలుసు తెంపుకుని పరారయ్యే యత్నం చేశారు. బాధితురాలు అప్రమత్తం కావడంతో తెగిపోయినా కూడా గొలుసు మాత్రం ఆమె మెడలో ఉండిపోయింది. ఆ తర్వాత ఆగంతకులు పరారయ్యారు. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి విచారించారు. గొలుసు దొంగల కోసం సమీపంలో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు.

రైతుకు అండగా ఉపాధి హామీ

- వ్యవసాయ అనుబంధ రంగాలకు రూ.180 కోట్ల ఖర్చుకు ప్రణాళిక
- 23 నుంచి గ్రామ సభలు
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు



కర్నూలు(అగ్రికల్చర్), ఆగస్టు 22: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని గత వైసీపీ ప్రభుత్వం పక్కదారి పట్టించింది. ఆనాటి పాలకులు, వారి అనుచరులు పెద్ద ఎత్తున జేబులు నింపుకున్నారు. ఏ మాత్రం ప్రజలకు పెద్దగా ప్రయోజనం చేకూర్చని పనులకు నిధులు ఖర్చు చేసేశారు. దీంతో వ్యవసాయ అనుబంధ రంగాలకు నిధులు లేక రైతులు పంటల సాగులో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. టీడీపీ ప్రభుత్వం వచ్చాక జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని రైతులకు అధిక ప్రయోజనం చేకూర్చేలా అమలు చేయాలని ఆయా జిల్లాల నీటి యాజమాన్య సంస్థ జిల్లా అధికారులకు ఆదేశాలు వచ్చాయి. గ్రామాల్లోని రైతులు, ఇతర వ్యవసాయ కూలీలకు పెద్ద ఎత్తున పనులు చేపట్టేందుకు కార్యాచరణ ప్రణాళికలు తయారు చేయాలని ఆదేశాలు వచ్చాయని కర్నూలు జిల్లా డ్వామా పీడీ అమర్నాథ్ రెడ్డి తెలిపారు.

అవగాహన లేక

ఉపాధి చట్టంపై రైతులు, వ్యవసాయ కూలీలకు ఇప్పటి దాకా అవగాహన లేదు. దీని వల్లనే కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన కనీస వేతనం రూ.300 పొందలేకపోతున్నారు. ఇప్పటి దాకా రోజు కూలి రూ.230 నుంచి రూ.250లు మాత్రమే వ్యవసాయ కూలీలు పొందుతున్నారని, ఇకపై పూర్తి స్థాయిలో కూలీ డబ్బులను వారికి అందేలా చర్యలు తీసుకుంటామని డ్వామా పీడీ అమర్నాథ్ రెడ్డి తెలిపారు.

పెద్ద ఎత్తున వ్యవసాయ అనుబంధ పనులు

రెండు జిల్లాల్లో దాదాపు రూ.300 కోట్లకు పైగానే వ్యవసాయ అనుబంధ శాఖల పరిధిలోని పనులను ఈ గ్రామ సభల్లో ఖరారు చేయనున్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ఇకపై ప్రణాళిక మేరకు పక్కాగా అమలు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే చేసిన పనుల్లో అక్రమాలు చోటు చేసుకున్నా సామాజిక తనిఖీలపై అభ్యంతరాలున్నా కొత్తగా గుర్తించిన పనులు, వాటి ప్రగతి వ్యవసాయ కూలీలకు వేతనం, గిట్టుబాటు తదితర అంశాలపై గ్రామ పంచాయతీల్లో 23వ తేదీన నిర్వహిస్తున్న గ్రామసభల్లో నిర్ణయాలు ఖరారు చేయనున్నారు. చెరువులు, ప్రధాన జలాశయాల కాలువల్లో పూడికతీత, ఫీడర్ కాలువల నిర్మాణం, కొత్త పంట కాలువల తవ్వకం, నర్సరీల పెంపకం, పశువులు పొలాల్లో మేత వేయకుండా రక్షణ కందకాలు, రైతుల భూముల్లో నీటి కుంటల నిర్మాణం, భూమి చదును వంటి 46 రకాల పనులు చేపట్టేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఇప్పటికే గుర్తించిన పనులను జిల్లాలో చేపట్టారు. ఇకపై చేపట్టబోయే పనులపై గ్రామ సభలు నిర్వహించి ఆమోదం తీసుకోవడం జరుగుతుందని, ఈ పనులకు సంబంధించి ప్రజల నుంచి అభ్యంతరాలు, సూచనలు వస్తే వాటిని పరిగణనలోకి తీసుకుని పరిష్కరిస్తామని పీడీ అమర్నాథ్ రెడ్డి తెలిపారు.

పంటలపై అడవి పందుల దాడి

- దెబ్బతిన్న పంటలు
- రాత్రిళ్లు పొలాల్లోనే జాగరణ చేస్తున్న రైతులు
- ఏటా అన్నదాతకు తప్పని నష్టాలు




ఇటీవల అడవి పందులు నాశనం చేసిన మొక్కజొన్న పంట, పంట చుట్టూ చీరలు ఏర్పాటు చేసిన రైతు

ఆత్మకూరు, ఆగస్టు 22: నల్లమల అటవీ సమీప గ్రామాల రైతులు అడవిపందుల ధాటికి అల్లాడిపోతున్నారు. ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసుకున్న మొక్కజొన్న పంట పొలాల్లోకి రాత్రివేళల్లో అడవిపందులు ప్రవేశించి బీభత్సాన్ని సృష్టిస్తున్నాయి. ప్రస్తుతం ఆత్మకూరు వ్యవసాయ డివిజన్ పరిధిలోని సాగుచేసిన మొక్కజొన్న కంకిదశలో ఉంది. ఇలాంటి సమయంలో అడవిపందులు పంటలోకి ప్రవేశించి ప్రారంభదశలో వున్న కంకిని నమిలేస్తూ నాశనం చేస్తున్నాయి. పంటపొలాల్లోకి అడవిపందులను రానివ్వకుండా చర్యలు చేపట్టాలని అటవీ సమీప గ్రామాల రైతులు అటవీ అధికారులకు మొరపెట్టుకున్నప్పటికీ ఎలాంటి ఫలితం లేకుండా పోయిందని వాపోతున్నారు. ఒకవేళ తామే స్వయంగా అడవిపందుల నియంత్రణకై రక్షణ చర్యలు చేపడితే అటవీ చట్టాల ప్రకారం కేసులను నమోదు చేస్తామని అటవీ అధికారులు హెచ్చరిస్తున్నారని బాధిత రైతులు పేర్కొన్నారు. ఈ ఏడాది ఆత్మకూరు వ్యవసాయ డివిజన్‌లో ఖరీఫ్ సాగులో భాగంగా 15370 హెక్టార్లలో మొక్కజొన్న పంటను రైతులు సాగుచేశారు. ఇందులో ఆత్మకూరు మండలంలో4539, పాములపాడులో 4463, కొత్త పల్లిలో 5344, వెలుగోడు మండలంలో 1024 హెక్టార్లలో మొక్కజొన్న పంట సాగైంది. అయితే సాగుదశలో ఉన్న ఈ పంటలను అడవిపందులు ధాటి నుంచి రక్షించుకునేందుకు అన్నదాతలు అవస్థలు పడుతున్నారు.

రాత్రిళ్లు పొలాల్లోనే జాగరణ

అడవిపందులు బారి నుంచి పంటపొలాలను రక్షించుకునేందుకు రాత్రిళ్లు పంటపొలాల్లోనే జాగరణ చేయాల్సిన దుస్థితి నెలకొంది. పంట చేతికొచ్చే సమయానికి అడవిపందులు ధాటికి పంటలు నాశనం అవుతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. రోజూ కూలీలను జతచేసుకుని రాత్రంతా.. పొలాల్లో కాపలా ఉండాల్సిన దుస్థితి నెలకొంది. కూలీలకు ఇచ్చే వేతనమే కాకుండా టపాకాయలకు వందల రూపాయలు ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. అంతేకాకుండా తక్కువ రకానికి చెందిన చీరలను కొనుగోలు చేసి పంటచుట్టూ రక్షణ కవచంలా ఏర్పాటు చేసుకున్న అడవిపందులు వదలడం లేదు. కొంతమేర వీటి వల్ల ఉపయోగం వున్నప్పటికీ ఎలాగోలా పంటలోకి ప్రవేశించి నాశనం చేస్తున్నాయి. సుమారు 10 నుంచి 15 గుంపులతో కూడిన అడవిపందులు ఒక్కసారిగా పంటపొలంపై పడి పంటనంతా నాశనం చేస్తున్నాయి. చేతికొచ్చే పైరంతా నేలవాలి ఎందుకు పనికి రాకుండా పోతున్నాయి. దీంతో ప్రాణాలను తెగించి మరీ అన్నదాతలు పొలాల్లోనే జీవనం చేయాల్సి వస్తోంది.

నియంత్రణకు చొరవ తీసుకోని అటవీ శాఖ:

ఎక్కడైనా.. అడవిపందిని వధించారంటే.. అందుకు గల కారణాలను అన్వేషించి సంబంధిత అటవీ అధికారులు బాధ్యులపై శాఖపరమైన చర్యలు తీసుకుంటున్నారు. అయితే పొలాల్లోకి అడవిపందులు రాకుండా నియంత్రణ చర్యలు చేపట్టడం లేదన్న విమర్శలు ఉన్నాయి. అడవుల్లోకి అడవిపందులకు సరైన ఆహారం అందకపోవడంతోనే అవి దారిమళ్లి పంటపొలాలను నాశనం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇదిలావుంటే అడవిపందుల ధాటికి నష్టపోయిన రైతులకు కూడా పరిహారం నామమాత్రంగానే ఇస్తున్నారు. ఈ మొత్తంతో కనీసం పరిహారం కోసం దరఖాస్తు చేసుకునే ఖర్చులకు కూడా సరిపడటం లేదని తెలుస్తోంది. అయితే అడవిపందులు పొలాల్లోకి రాకుండే ఉండేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడమే కాకుండా ఆయా అటవీ ప్రాంతానికి కంచెను ఏర్పాటు చేస్తే.. ఇలాంటి సమస్య ఉండదని రైతులు అంటున్నారు.

ఎరువుల విక్రయం నిలిపివేత



ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న డీఏవో

నంద్యాల టౌన్, ఆగస్టు 22: నంద్యాలలోని వివిధ ఎరువుల దుకాణాలలో వ్యవసాయ శాఖాధికారులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. గురువారం జిల్లా వ్యవసాయాధికారి వైవీ మురళీకృష్ణ నేతృత్వంలో ఏవో ప్రసాదరావు, తదితర సిబ్బంది ఎరువులు, పురుగుల మందుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీల్లో బైసాని ట్రేడర్స్, గోళ్ళ వెంకటనారాయణ శెట్టి ఎరువుల దుకాణంలో పలు పత్రాలు, రిజిస్టర్లు, బిల్ బుక్కులు, ఎరువుల నిల్వలను పరిశీలించారు. ఇందులో సరైన పత్రాలు లేకపోవడంతో రూ.8.40 లక్షల విలువ చేసే ఎరువుల అమ్మకాలను నిలుపుదల చేసినట్లు డీఏవో వెల్లడించారు. ఎరువుల కంపెనీ ప్రతినిధులు, హోల్‌సేల్ దుకాణాలు, రిటైల్ దుకాణాల యజమానులు రైతులకు ఎరువుల కొరత రాకుండా సక్రమంగా సరఫరా చేయాలని ఆదేశించారు. రిజిస్టర్లు, క్షేత్రస్థాయిలో నిల్వలు సమానంగా ఉండాలన్నారు. ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని డీఏవో హెచ్చరించారు. ఎరువులు, పురుగుల మందు కొన్న ప్రతి రైతుకు బిల్లు ఇవ్వాలని, నిబంధనలకు విరుద్ధంగా నడుచుకుంటే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

'కాలేజీలో అడ్మిషన్ తీసుకోండి'

ఆత్మకూరు, ఆగస్టు 22: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 22 నుంచి 24వ తేది వరకు జరగనున్న రెండో దశ అడ్మిషన్లను అర్హులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ జిష్ణు నాగ్ విజయ్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. తమ కళాశాలలో బీఎస్సీ గ్రూపుల్లో కంప్యూటర్ సైన్స్ ఫిజిక్స్ జువాలజీ, బీకామ్(కంప్యూటర్ అప్లికేషన్స్), బీఏ (పొలిటికల్ సైన్స్) గ్రూపుల్లో సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఇంటర్మీడియట్ పాసైన విద్యార్థులు అడ్మిషన్లు సద్వినియోగం చేసుకోవాలన్నారు. తమ కళాశాల ప్రాంగణంలోనే హాస్టల్ వసతి సదుపాయం ఉన్నట్లు ఆయన వెల్లడించారు.

'వయ్యారిభామ మొక్క ప్రమాదకరం'



వయ్యారిభామ మొక్కలను తొలగిస్తున్న శాస్త్రవేత్తలు

నంద్యాల టౌన్, ఆగస్టు 22: వయ్యారి భామ కలుపు మొక్క ఎంతో ప్రమాదకరమని నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ డాక్టర్ ఎం.జాన్సన్ అన్నారు. గురువారం ఆర్ఏఆర్ఎస్‌లో ప్రమాదకర కలుపు మొక్క వయ్యారి భామ నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఏడీఆర్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఈనెల 16వ తేదీ నుంచి 22వ తేదీ వరకు స్వచ్ఛ భారత్ అభియాన్‌లో భాగంగా వయ్యారి భామ కలుపు మొక్క నివారణపై అవగాహన సదస్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వయ్యారి భామ కలుపు మొక్క అనేక పంటల్లో ఆశించి పంట దిగుబడిని తగ్గించడమే కాకుండా అనేక ప్రమాదకర వైరస్‌లను కూడా పంటల్లో వ్యాపింపజేస్తుందని అన్నారు. వ్యవసాయంలో తీవ్ర నష్టం కలిగించే వయ్యారి భామ కలుపు మొక్క మనుషుల్లో కూడా అనేక అలర్జీలకు కారణమవుతుతోందని అన్నారు. ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు, వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

'దేశ క్షేమాన్ని కోరుకోవాలి'



గర్భిణులకు సీమంతం చేస్తున్న సంస్థ మహిళలు

నంద్యాల (నూనెపల్లె), ఆగస్టు 22: పౌరులందరూ దేశ క్షేమాన్ని కోరుకోవాలని పరంజ్యోతి మానవ సేవా సమితి నిర్వాహకురాలు దీక్షిత దాసాజి పిలుపునిచ్చారు. గురువారం నంద్యాల సర్వజన వైద్యశాలలోని మాతా శిశు సంరక్షణ విభాగంలో పరంజ్యోతి మానవ సేవా సమితి ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతం కార్యక్రమాన్ని నిర్వహించారు. సేవా సమితి నిర్వాహకురాలు దీక్షిత దాసాజి, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వరప్రసాదరావు, నంద్యాల ఐఎంఏ అధ్యక్షురాలు డాక్టర్ వసుధారాణి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఆసుపత్రిలోని 108 మంది గర్భిణులకు సీమంతం చేశారు. కుంకుమ, గంధం, అక్షింతలు, నూతన వస్త్రాలు, పండ్లు, స్వీట్లు, గర్భిణులకు అందజేశారు. ఆసుపత్రి వైద్య బృందం, సేవా సమితి ప్రతనిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపటి నుంచి ప్రవచనాలు

శ్రీశైలం, ఆగస్టు 22: శ్రీశైలం మహాక్షేత్రంలో ధర్మపథంలో భాగంగా శనివారం నుంచి ప్రఖ్యాత ప్రవాచకులు సామవేదం షణ్ముఖశర్మతో దేవస్థానం ప్రవచన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమంలో 'గణేశగాథలు' అనే అంశంపై ప్రవచనం చేయనున్నారు. తొమ్మిది రోజుల పాటు ఈ ప్రవచన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద ప్రతిరోజు సాయంత్రం 7 నుంచి 8.30 గంటల వరకు నిర్వహించనున్నారు. కార్యక్రమంలో గణపతి ఆవిర్భావ గాథలు, గణపతి తత్త్వం, గణపతి స్వరూపంలోని అంతరార్థాలు, గణపతి మహిమావిశేషాలు మొదలైన అంశాలతో పాటు శ్రీశైల క్షేత్ర మహిమలను వివరించనున్నట్లు పేర్కొన్నారు.

ఘనంగా జియారత్

మహానంది, ఆగస్టు 22: మండలంలోని ఎం.తిమ్మాపురం గ్రామంలో గురువారం రాత్రి భక్తి శ్రద్ధలతో పెద్ద మౌలాలి స్వామి, చిన్న మౌలాలి స్వామి జియారత్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మొహర్రం పర్వదినం పూర్తయిన 41 రోజులకు తిమ్మాపురంలో జియారత్ వేడుకలను నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగానే ఈ ఏడాది కూడా పీర్ల స్వాములను పూలతో అలంకరించారు. అనంతరం ప్రజలు పీర్ల స్వాములను దర్శించుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి పోలీస్ బందోబస్తు చేపట్టారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

శ్రీశైలం, ఆగస్టు 22: శ్రీశైల దేవస్థానం ధర్మపథంలో భాగంగా నిర్వహిస్తున్న నిత్యకళారాధన కార్యక్రమంలో గురువారం కర్నూలుకు చెందిన పిగీతారెడ్డి బృందంతో భరతనాట్యం కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్య కళారాధన వేదిక వద్ద నిర్వహించిన కార్యక్రమంలో సిద్ధి వినాయక, ఓం నమఃశివాయ, శివ శివ శంకర, గరుడ గమన, శివ తాండవం తదితర గీతాలకు కళాకారులు నృత్య ప్రదర్శనతో అలరించారు.

పాఠశాలల తనిఖీ



ఎస్సీ బాలుర వసతి గృహాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

మిడుతూరు, ఆగస్టు 22: మిడుతూరు గ్రామంలోని మోడల్ స్కూల్, కేజీబీవీ, మోడల్ స్కూల్ బాలికల వసతి గృహం, ఎస్సీ బాలుర వసతి గృహాన్ని ఎంపీడీవో నాగశేషాచల రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ షానవాజ్, ఎంఈవో శ్రీనాథ్ గురువారం పరిశీలించారు. మంచినీటి సమస్య, అదనపు మరుగుదొడ్లు, కంప్యూటర్ ల్యాబ్, ఎస్సీ బాలుర వసతి గృహంలో ఆర్వో ప్లాంటు తదితర సమస్యలను గుర్తించి నివేదికను తయారు చేసి పంపుతున్నట్లు వారు తెలిపారు. వీరి వెంట ప్రిన్సిపాల్ సలీంబాషా, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఉమాగైరవాణి, పంచాయతీ కార్యదర్శి సుధీర్ నందకుమార్ పాల్గొన్నారు.

కోల్‌కతా ఘటనపై నిరసన ర్యాలీ

పాణ్యం, ఆగస్టు 22: కోల్‌కతాలో జరిగిన జూనియర్ వైద్యురాలి హత్యకు నిరసనగా గురువారం ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు ర్యాలీ నిర్వహించారు. ఉమెన్ ఎంపవర్‌మెంట్ కోఆర్డినేటర్ హరిత, ఐసీసీ కోఆర్డినేటర్ డాక్టర్ సుధామాధురి, శాంతలా ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జయచంద్రప్రసాద్ మాట్లాడుతూ కోల్‌కతాలో చోటు చేసుకున్న వైద్యురాలి హత్యకేసులో నిందితులకు కఠిన శిక్ష వేయాలన్నారు. వైద్యులకు భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ అశోక్‌కుమార్, డీన్ ఆఫ్ స్టూడెంట్స్ అఫైర్స్ డాక్టర్ రామిరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళా రక్షణపై అవగాహన

నంద్యాల క్రైం, ఆగస్టు 22: నంద్యాల పోలీస్ సైబర్ సెక్యూరిటీ విభాగం ఎస్ఐ కుమారి ఆధ్వర్యంలో పట్టణంలోని రామకృష్ణ డిగ్రీ కళాశాలలో సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో విద్యార్థులకు సైబర్ నేరాలు, హ్యూమన్ ట్రాఫికింగ్, ట్రాఫిక్ నిబంధనలు, మహిళలు, చిన్న పిల్లలపై జరిగే నేరాల నివారణ గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ ఏదైనా సమస్య వస్తే 100 నెంబరుకు డయల్ చేయడం, సమీప పోలీస్ స్టేషన్లను ఆశ్రయించాలని తెలిపారు. ఇతర ప్రాంతాలు, రాష్ట్రాలు, విదేశాల్లో ఉద్యోగాలంటూ ప్రజలను మోసం చేస్తూ విదేశీ ముఠాలకు విక్రయిస్తుంటారని యువత, మహిళలు, ప్రజలు ఇలాంటి వాటిపట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరాలు, ఆన్‌లైన్‌లో జాబ్స్ అంటూ ఊదరగొడుతూ మోసం చేస్తుంటారని, జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఇక రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసులు, ట్రాఫిక్ పోలీసులు తీసుకుంటున్న చర్యలకు ప్రజలు, వాహనదారులు సహకరించి ప్రమాదాలను నివారించాలని కోరారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సుబ్బయ్య ఎన్ఎస్ఎస్ విభాగం ఇన్‌చార్జి రవణమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

'సంబంధం లేని డ్యూటీలు వేయడం సరికాదు'



ఏవోకు వినతి పత్రం అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు

వెలుగోడు, ఆగస్టు 22: సచివాలయ ఉద్యోగులకు సంబంధం లేని డ్యూటీలు వేయడం సమంజసం కాదని సచివాలయ వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్‌లు అన్నారు. ప్రభుత్వం తమకు పాఠశాలల్లో టాయిలెట్ ఫొటోలు తీయాలని విధులు కేటాయించడం సరికాదని అన్నారు. మండలంలోని సచివాలయ ఉద్యోగులు గురువారం ఎంపీడీవో కార్యాలయంలో ఏవో ఉమర్‌ని కలిసి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. పాఠశాలల్లో గతంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు ఫొటోలు తీసేవారని అన్నారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం ఉపాధ్యాయులను తొలగించి సచివాలయ ఉద్యోగులకు కేటాయించడంతో తాము పాఠశాలలకు వెళ్లి ఫొటోలు తీయాలా?, సచివాలయాలకు వెళ్లి ఉద్యోగాలు చేయాలా? అని ప్రశ్నించారు. తమను సచివాలయాలకే పరిమితం చేయాలని కోరారు.

పేద కుటుంబానికి చేయూత

మహానంది, ఆగస్టు 22: మసీదుపురం గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబాలకు చెందిన వధు, వరులకు వివాహం కోసం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు నరాల చంద్ర మౌళీశ్వరరెడ్డి చేయూతనందించారు. గురువారం గ్రామానికి చెందిన నులక చందనం బాబు, చంద్ర వివాహానికి తాళి బొట్లు, వస్త్రాలను అందజేశారు.

'ప్రజలు అప్రమత్తంగా ఉండాలి'



వేంపెంట గ్రామంలో ప్రజలతో మాట్లాడుతున్న డీఎస్పీ

పాములపాడు, ఆగస్టు 22: నేటి సమాజంలో అమాయకులైన ప్రజలను సైబర్ నేరాగాల్లు టార్గెట్ చేసి మోసాలకు పాల్పడుతుంటారని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆత్మకూరు డీఎస్పీ రామాంజీనాయక్, రూరల్ సిఐ సురేశ్‌కుమార్‌రెడ్డి అన్నారు గురువారం మండలంలోని వేంపెంట గ్రామంలో పాములపాడు ఎస్ఐ సురేశ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వారు పాల్గొన్నారు ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ సైబర్ క్రైమ్, రోడ్డు భద్రత, మహిళలపై జరిగే నేరాలు, బాల్య వివాహాలపై తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. తల్లి తండ్రులు తమ పిల్లలు సెల్ మాట్లాడేటప్పుడు నిఘా ఉంచాలని సూచించారు. గ్రామాల్లో సమస్యలు తలెత్తినప్పుడు సంబంధిత అధికారులను సంప్రదించి సమస్యను పరిష్కరించుకోవాలని, గ్రామాల్లో ఎవరైన అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని అన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, ప్రజలు పాల్గొన్నారు.

పంట నమోదు తప్పనిసరి : ఏడీఏ



నందికుంటలో పంటను పరిశీలిస్తున్న ఏడీఏ ఆంజనేయ

కొత్తపల్లి, ఆగస్టు 22: ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతులు కచ్చితంగా స్థానిక రైతుభరోసా కేంద్రాల్లో పంట నమోదు చేయించుకోవాలని ఆత్మకూరు సహాయ వ్యవసాయ సంచాలకుడు ఆంజనేయ సూచించారు. మండలంలోని దుద్యాల, నందికుంట గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలను గురువారం ఆయన తనిఖీ చేసి రైతులతో మాట్లాడారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల వల్ల పంట స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. అలాగే రానున్న రబీ సీజన్‌లో రైతులు ఏయే పంటలు సాగు చేస్తున్నారు?, వీటికి కావాల్సిన విత్తనాల గురించి ఆరా తీశారు. రైతులు పంట నమోదు చేసుకుంటేనే బీమా ఇన్‌పుట్ సబ్సిడీ, మద్దతు ధరలతో పాటు ఇతర వ్యవసాయ ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయని తెలిపారు. నందికుంట గ్రామంలో ఏడీఏ ఆంజనేయ వీఆర్వో కృష్ణారెడ్డి, రైతులతో కలిసి కంది, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. రైతు సేవా సిబ్బంది శేషు, శివకృష్ణ నాయక్, ఎంపీఈవో పల్లవి, రైతులు ఉన్నారు.

మల్యాలలో 'పొలం బడి'



పొలం బడి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న వ్యవసాయాధికారులు

నందికొట్కూరు రూరల్, ఆగస్టు 22: నందికొట్కూరు మండలంలోని మల్యాల గ్రామంలో గురువారం వ్యవసాయాధికారులు రైతులతో కలిసి మొక్కజొన్న, కంది పంటలలో పొలం బడి కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం రైతుల అభివృద్ధికోసం ఏర్పాటు చేసిన పొలం బడి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని నందికొట్కూరు వ్యవసాయ సంచాలకుడు విజయశేఖర్, నందికొట్కూరు మండల వ్యవసాయాధికారి షేక్షావలి రైతులకు సూచించారు. వారు మాట్లాడుతూ గ్రామంలో 30 మంది రైతులతో కలిసిఒక యూనిట్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. వారు పండించిన పంటను ఫార్మర్ ఫుడ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (ఎఫ్‌డీవో) ద్వారా ఎంఎస్‌పీ కంటే ఎక్కువ ధర లభించేలా రైతులకు మార్కెటింగ్ చేయిస్తామని తెలిపారు. అందుకే ప్రభుత్వం ఏర్పాటుచేసిన పథకాలపై రైతులు అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది. రైతులు పాల్గొన్నారు.

చెక్కు పంపిణీ

గోస్పాడు, ఆగస్టు 22: ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పాలసీ చెక్కు రూ.2 లక్షలు గురువారం ఏపీజీబీ గోస్పాడు బ్యాంక్ మేనేజర్ చంద్రశేఖర్, డిప్యూటీ మేనేజర్ సాహితిలు చెక్కును నామిని కుటుంబ సభ్యులకు అందజేశారు. రేవనూరు గ్రామానికి చెందిన కోనేటి దేవమ్మ ప్రమాదవ శాత్తు శనగ యంత్రం వెనుక భాగంలోని తొట్టిలో జారిపడి మృతి చెందారు. ఆమె ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ గోస్పాడు బ్రాంచ్‌లో ప్రధానమంత్రి సురక్షమా యోజన పాలసీని చేసి ఉన్నారు. సదరు ఇన్సూరెన్స్ మొత్తాన్ని వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. డీసీ కిరణ్‌కుమార్, గ్రామస్థులు పాల్గొన్నారు.

'విద్యుత్ కోతలకు వేటగాళ్లే కారణం'

కొత్తపల్లి, ఆగస్టు 22: రాత్రి వేళల్లో అడవి పందుల వేట కోసం ఉచ్చులు వేసే వేటగాళ్లే విద్యుత్ కోతలకు కారణమని ఆత్మకూరు విద్యుత్ ఏడీ రమేష్ అన్నారు. గురువారం విద్యుత్ ఏడీ మాట్లాడుతూ కొత్తపల్లి మండలంలో గత పది రోజులుగా ఉన్న ఫలంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగడంతో క్షేత్రస్థాయిలో గ్రామాల్లో ఏడీ, ఏఈలతో పాటు సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలించామన్నారు. దీనికంతటికి కారణం అడవి పందుల వేట కోసం రాత్రివేళల్లో పంట పొలాల్లో విద్యుత్ వైర్లు అమర్చి నేరుగా మెయిన్‌లైన్‌కు వేటగాళ్లు వైర్లు తగిలిస్తున్నట్లు గుర్తించామన్నారు. అడవి పందులకు విద్యుత్ వైర్లు తగిలిన వెంటనే లైన్ ట్రిప్‌అయి గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతోందన్నారు. దీంతో పంట పొలాలకు, గృహాలలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో విద్యుత్ అధికారులపై గ్రామస్థులు ఫిర్యాదు చేస్తున్నారని అన్నారు. ముఖ్యంగా శివపురం, గుమ్మడాపురం, సింగరాజుపల్లి, ఎర్రమఠం, పాతమాడుగుల, కపిలేశ్వరం, సంగమేశ్వరం గ్రామాలు అటవికి సమీపంలో ఉండటం వల్ల అడవి నుంచి పందులు పంట పొలాల్లోకి వస్తున్నాయని, వీటి కోసం వేటగాళ్ల పని గట్టుకుని విద్యుత్ అంతరాయం కలిగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి వారిని గుర్తించి వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఇప్పటికే పంట పొలాల్లో వేటగాళ్లు వదిలివెళ్లిన పందుల కోసం ఉపయోగించే విద్యుత్, ఉచ్చు సామగ్రిని స్వాధీనం చేసుకున్నామన్నారు.

'వంద రోజుల ఉపాధి పనులు కల్పించాలి'



ఎంపీడీవోకు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

ఆత్మకూరురూరల్, ఆగస్టు 22: వలసలను నివారించేందుకు గ్రామీణ నిరుపేదలకు వందరోజుల ఉపాధి హామి పని దినాలను కల్పించాలని, ఉపాధి పనులు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు నరసింహనాయక్ అన్నారు. నాయకులు ఎంపీడీవో మోహన్‌కుమార్‌కు గురువారం వినతి పత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ గ్రామాల్లోని ఎస్సి ఎస్టీ స్మశాన వాటికల్లో చెట్లను తొలగించి మట్టి తోలి దారి సరిచేయడం, గిరిజనులకు ఇచ్చిన పట్టా భూముల్లో చెట్లు తొలగించి చదును చేసుకునే పనులు కల్పించాలని కోరారు. గతంలో లాగా చెంచు గిరిజనులకు ప్రత్యేక ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేయాలన్నారు. గ్రామాల్లో చెరువల్లో పూడిక తీత పనులు, పంట కాలువలకు రోడ్లు, అలుగు నిర్మాణాలు లాంటి పనులు కల్పించాలన్నారు. రైతులకు ఫారంపాండ్, కొత్త బావుల నిర్మాణం, బావుల్లో పూడిక తీత పనులు గుర్తించి వంద రోజుల పని దినాలు కల్పించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. అలాగే ఆత్మకూరు పట్టణంలో ఎంతో మంది ఉపాధి కూలీలు ఉన్నారని మున్సిపాలిటీలో కూడా ఈ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేసి పనులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కార్యదర్శి రామ్‌నాయక్, నాగేంద్రుడు, దేవేంద్ర నాయక్, పెద్ద నాగన్న, వెంకటమ్మ, మూగన్న తదితరులు పాల్గొన్నారు.

పంటల నమోదు పరిశీలన



పంట నమోదును పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

మహనంది, ఆగస్టు 22: గోపవరం పంట పొలాల్లో సిబ్బంది ఖరీఫ్ సీజన్‌కు సంబధించిన పంట నమోదు కార్యక్రమాన్ని గురువారం ఏవో నాగేశ్వరరెడ్డి పరిశీలించారు. సిబ్బంది కొన్ని సూచనలు ఇచ్చారు. పంట నమోదు చేసుకొన్న రైతులకు మాత్రమే సున్నా వడ్డీ, పంట భీమాతో నష్ట పరిహారం పొందే అవకాశం ఉందన్నారు. మండలంలోని రైతులు పంట నమోదు తప్పనిసరిగా చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి తెలిపారు. కార్యక్రమంలో గ్రామ ఉద్యానవన సహాయకురాలు హరిత, రైతులు పాల్గొన్నారు.

అధ్యక్షుడిగా భవనాశి శ్రీనివాస ఎన్నిక



భవనాశి శ్రీనివాసకు స్వాగతం పలుకుతున్న ఆర్యవైశ్యులు

నంద్యాల (కల్చరల్), ఆగస్టు 22: ప్రధాన నగరములైన షిర్డీ, తిరుపతి, హరిద్వార్, హైదారాబాద్, కాశీ క్షేత్రంలో వెలసిన కాశీ అన్నపూర్ణ వాసవీ ఆర్యవైశ్య వృద్ధాశ్రమం, నిత్యాన్నదాన సత్రాలకు అధ్యక్షుడిగా నంద్యాకు చెందిన భవనాశి శ్రీనివాసులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా గురువారం నంద్యాలలో భవనాశి శ్రీనివాసకు పట్టణ ఆర్యవైశ్య సంఘాలు ఘన స్వాగతం పలికారు. భవనాశి శ్రీనివాస ముందుగా గాంధీచౌక్‌లో వెలసిన గాంధీవిగ్రహానికి పూలమాల వేసి ఊరేగింపుగా నంద్యాల అమ్మవారిశాలకు చేరుకొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ స్వాగత కార్యక్రమంలో భవనాశి నాగమహేష్, ఆర్యవైశ్య సంఘం నాయకులు, ఆర్యవైశ్య మహిళా మండలి సభ్యులు, తదితరలు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం




దాతలకు స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేస్తున్న పర్యవేక్షకురాలు హిమబిందు

శ్రీశైలం, ఆగస్టు 22: దేవస్థానం నిర్వహిస్తున్న శాశ్వత అన్నప్రసాద పథకానికి ప్రకాశం జిల్లా చీమకుర్తికి చెందిన పి. శేషగిరిరావు రూ.1,01,116 విరాళాన్ని, గుంతకల్‌కు చెందిన బి. పునీత్‌కుమార్ అనే భక్తుడు రూ.లక్ష విరాళంగా అందజేశారు. దాతలు ఈ విరాళాన్ని దేవస్థానం పర్యవేక్షకురాలు టి.హిమబిందుకు అందజేశారు. దాతలను దేవస్థానం అధికారులు స్వామి, అమ్మవార్ల చిత్రపటం, శేషవస్త్రాలు అందజేసి సత్కరించారు.

మైనింగ్ కళాశాలను ఏర్పాటు చేయాలి

మంత్రి నారా లోకేశ్‌ను కలిసిన కోట్ల దంపతులు



నారా లోకేశ్‌తో ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి, కోట్ల సుజాతమ్మ

డోన్, ఆగస్టు 22: డోన్ ప్రాంతంలో మైనింగ్ గనులు ఎక్కువగా ఉన్నందు వల్ల అక్కడ మైనింగ్ కళాశాలను ఏర్పాటు చేయాలని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ దంపతులు ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను కోరారు. గురువారం ఉండవల్లిలోని సీఎం నివాసంలో మంత్రి నారా లోకేశ్‌ను కోట్ల దంపతులు కలిసి డోన్ నియోజకవర్గ అభివృద్ధిపై చర్చించారు. డోన్, ప్యాపిలి, బేతంచెర్ల మండలాల్లో డోలమైట్, లైమ్‌స్టోన్, గ్రానైట్, వైటసేల్, స్క్వార్ట్జ్, నాపరాతి గనులు ఎక్కువగా ఉన్నాయన్నారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలమంది కార్మికులు వాటి మీద ఆధారపడి జీవనం సాగిస్తున్నారని వివరించారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు డోన్ ప్రాంతంలో మైనింగ్ కళాశాలను ఏర్పాటు చేయాలని మంత్రి లోకేశ్‌ను ఎమ్మెల్యే కోట్ల కోరారు. అలాగే హార్టికల్చర్ టర్మినల్ మార్కెట్, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేయాలని విన్నవించారు. దీనికి మంత్రి నారా లోకేశ్ సానుకూలంగా స్పందించి డోన్ నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి ఆంధ్రజ్యోతికి తెలిపారు.

బెలుం శింగవరంలో 'పొలం బడి'

కొలిమిగుండ్ల, ఆగస్టు 22: మండలంలోని బెలుం శింగవరం గ్రామంలో గురువారం మండల వ్యవసాయ అధికారి భూమా జ్యోతి పొలం బడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వరి నాటు విధానం, శుద్ధి ప్రక్రియపై రైతులకు ఆమె అవగాహన కల్పించారు. వరి సాగులో తెగుళ్లను నివారించాలంటే నారను సుజమోనాస్ అనే జీవ సిలీంద్రంతో శుద్ధి చేసుకోవాలని సూచించారు. అనంతరం సుడోమోనాస్ జీవ రసాయన ఎరువును రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వీఏఏ చిన్నయ్య, రైతులు పాల్గొన్నారు.

28న యాగంటిలో వేలం పాటలు

బనగానపల్లె, ఆగస్టు 22: యాగంటి ఉమామహేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 28న వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు ఈవో చంద్రశేఖర్ రెడ్డి గురువారం తెలిపారు. కొబ్బరికాయులు, పండ్లు, బొమ్మలు, ఐస్‌క్రీం, తలనీలాలు, కొబ్బరి చిప్పలు పోగు చేసుకునే హక్కుకు దేవదాయశాఖ అధికారుల సమక్షంలో వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు ఈవో తెలిపారు.

ఘనంగా చౌడేశ్వరీమాత పల్లకీ సేవ

బనగానపల్లె, ఆగస్టు 22: మండలంలోని నందవరం చౌడేశ్వరీ మాత ఆలయంలో శుక్రవారం అమ్మవారి పల్లకీసేవ ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈవో కామేశ్వరమ్మ, పూజారులు, భక్తుల ఆధ్వర్యంలో అమ్మవారిని పల్లకిలో ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

నాటుసారా స్థావరాలపై దాడులు

ప్యాపిలి, ఆగస్టు 22: మండలంలోని సీతమ్మతండా పరిసర ప్రాంతాల్లో నిర్వహిస్తున్న నాటుసారా స్థావరాలపై గురువారం పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 10 నాటుసారా బట్టీలను ధ్వంసం చేసి 200 లీటర్ల బెల్లం ఊటను నేలపాలు చేశారు. ఈ దాడుల్లో రాచెర్ల ఎస్ఐ లక్ష్మణరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రఘునాథరావు మృతికి నివాళి

బనగానపల్లె, ఆగస్టు 22: పట్టణంలోని రంగరాజుపేటకు చెందిన తోపుడుబండ్ల రఘునాథరావు (64) మృతికి బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి గురువారం సంతాపం వ్యక్తం చేశారు. రఘునాథరావు అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన భౌతిక కాయానికి రాజారెడ్డి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

బనగానపల్లె , ఆగస్టు 22: విద్యతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని పలుకూరు జెకెఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బ్రహ్మానందాచారి అన్నారు. గురువారం పలుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో గత సంవత్సరం పదో తరగతిలో ప్రతిభ కనబరచిన నలుగురు విద్యార్థులకు దువ్వూరుకు చెందిన తెలుగు పండిట్ సుబ్రహ్మణ్యాచారి సహకారంతో రూ.5వేలు నగదు పురస్కారాలు అందించారు. హెచ్ఎం గౌరీశంకర్ చేతుల మీదుగా ఈ నగదును విద్యార్థులకు అందించారు.

ప్రతిభ కనబరచిన విద్యార్థికి అభినందన



విద్యార్థిని అభినందిస్తున్న మోడల్ స్కూల్ సిబ్బంది

బనగానపల్లె, ఆగస్టు 22: జాతీయస్థాయి కరాటే పోటీల్లో బనగానపల్లె మోడల్ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న విద్యార్థి సాయిచరణ్‌తేజ బంగారు పతకం సాధించడంతో ఆయనను ప్రిన్సిపాల్ రామలక్ష్మి, ఉపాధ్యాయులు సత్కరించారు. ఈనెల 15 నుంచి 18 వరకు చండీఘర్‌లో జరిగిన జాతీయస్థాయి కరాటే పోటీల్లో ఏపీ తరపున పాల్గొన్న 30 మంది పాల్గొనగా సాయిచరణ్‌తేజ 52 కిలోల విభాగంలో జాతీయస్థాయి కరాటే పోటీల్లో పాల్గొని బంగారు పతకం సాధించారన్నారు. ప్రతిభకనబరచిన విద్యార్థి హెచ్ఎం రామలక్ష్మితో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు. కార్యక్రమంలో కరాటే కోచ్ కళ్యాణ్‌బాబు, కరాటే బాషా, రఫి తదితరులు పాల్గొన్నారు.

వేరుశనగ పంట పరిశీలన

బేతంచెర్ల, ఆగస్టు 22: మండలంలో రైతులు సాగు చేసిన వేరుశనగ పంటను యాగంటి పల్లె కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు ధనలక్ష్మి, సుధాకర్ గురువారం పరిశీలించారని మండల వ్యవసాధికారి కిరణ్ కుమార్ తెలిపారు. అగ్రికల్చర్ అసిస్టెంట్ వేణు, ఏఈవో మహ్మద్ ఉన్నారు.

విద్యారంగ సమస్యలపై పోరాటాం

డోన్(రూరల్), ఆగస్టు 22: విద్యారంగ సమస్యలపై పోరాడాలని కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి సుబ్బు యాదవ్ అన్నారు. గురువారం పట్టణంలోని గుత్తి రోడ్డులో ఉన్న ఎన్ఎస్‌యుఐ కార్యాలయంలో ఎన్ఎస్‌యూఐ సంఘంలో షేక్ దాదా, ఖలందర్, రఫీ, షేక్ మాబులు చేరారు. వీరికి సంఘం కండువాలు వేసి ఆహ్వానించారు. ఎన్ఎస్‌యుఐ జిల్లా ఉపాధ్యక్షుడు తెలుగు విజయకుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులకు సామగ్రి పంపిణీ

ప్యాపిలి, ఆగస్టు 22: మండలంలోని సిద్ధనగట్టు ప్రాథమిక పాఠశాలలో గురువారం విద్యార్థులకు పుస్తకాలు, ప్యాడ్స్ తదితర సామగ్రి పంపిణీ చేశారు. డోన్ ఇన్నర్‌వీల్ క్లబ్ ఆధ్వర్యంలో రూ.5వేల విలువ చేసే సామగ్రిని పిల్లలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ నిర్వాహకులు మద్దమ్మ, శైలజా, తనుజా, అనుషా, రాజేశ్వరి పాల్గొన్నారు.

పోలీసు శాఖలో బదిలీల జాతర

- ఉమ్మడి జిల్లాలో వందలాది మంది సీఐలు, ఎస్ఐల బదిలీలు
- త్వరలో జరగనున్న కానిస్టేబుళ్ల ట్రాన్స్‌ఫర్లు



కొలిమిగుండ్ల, ఆగస్టు 22: ఉమ్మడి జిల్లా పోలీసు శాఖలో పెద్ద ఎత్తున బదిలీల జాతర కొనసాగుతోంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తరువాత కాస్త ఆలస్యమైనా అత్యంత పారదర్శకంగా బదిలీల ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. పరిపాలనా విభాగంలో కీలకమైన పోలీసు శాఖలో బదిలీల ప్రక్రియపై ప్రభుత్వం ఆచితూచి అడుగులు వేసింది. పోలీసు శాఖను పూర్తిగా ప్రక్షాళన చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో పోలీసు శాఖను పూర్తిగా నీరుగార్చి, తమకు వత్తాసు పలికేవారిని అందలం ఎక్కించి, తద్వారా అక్రమాలకు తెరలేపారన్న విమర్శలు ప్రజల్లో వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం పోలీసు శాఖ బదిలీలపై ఎటువంటి విమర్శలకు తావులేకుండా పారదర్శకంగా నిర్వహిస్తున్నారు. ఎక్కాడా హడావుడి, పైరవీలకు తావు లేకుండా బదిలీల పక్రియ నిశబ్దంగా కొనసాగుతోంది. గత 10 రోజులుగా ఉమ్మడి జిల్లాలో పెద్ద ఎత్తున సీఐలు, ఎస్ఐల బదిలీల పర్వం కొనసాగుతోంది. ఉమ్మడి జిల్లాలో సుమారు 200మందికి పైగా నూతన సీఐలకు పోస్టింగ్‌లు ఇచ్చారు. శనివారం ఒక్కరోజే 39మంది సీఐలు, 11మంది ఎస్ఐలను బదిలీ చేస్తూ పోలీసు ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారంటే బదిలీల పర్వం ఏ స్థాయిలో కొనసా గుతుందో మనకు అర్థమవుతుంది. మరోవైపు ఎస్ఐల బదిలీల ప్రక్రియ కొనసాగుతోంది. త్వరలో ఏఎస్ఐ, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్ల బదిలీలు సైతం చేపట్టడానికి పోలీసు ఉన్నతాధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు.

జాతీయ అంతరిక్ష దినోత్సవం

చాగలమర్రి, ఆగస్టు 22: మండలంలోని చిన్నవంగలి ఉన్నత పాఠశాలలో గురువారం జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందస్తుగా పాఠశాల హెచ్ఎం జీవయ్య ఆధ్వర్యంలో చంద్రయాన్-3 విజయాన్ని పురస్కరించుకొని అంతరిక్ష దినోత్సవాన్ని నిర్వహించారు. స్పేస్ టెక్నాలజీ గురించి అవగాహన కల్పించుటకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని హెచ్ఎం పేర్కొన్నారు. విద్యార్థులకు రాకెట్, ఇస్రో ఆకారంలో కూర్చొబెట్టారు. సైన్స్, టెక్నాలజీ పట్ల భవిష్యత్తులో విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలని సూచించారు. సైన్స్ ఉపాధ్యాయులు నాగేంద్ర కుమార్, సుబ్బారెడ్డి, జయన్న, ఇజాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



ఇస్రో అక్షరాల ఆకారంలో కూర్చున్న విద్యార్థులు

ప్రజా సమస్యలు పరిష్కారానికి కృషి చేయండి



మాట్లాడుతున్న ఎంపీడీవో వెంకన్న

బేతంచెర్ల, ఆగస్టు 22: గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలని ఎంపీడీవో వెంకన్న అన్నారు. గురువారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ బుగ్గ నాగభూషణ్ రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం ఎంపీడీవో వెంకన్న నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ప్రభుత్వ శాఖల అధికారులు తమ తమ నివేదికలను చదివి వినిపించారు. ఎంపీడీవో వెంకన్న మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహించే ఉపాధి పనులపై గ్రామ సభలను నిర్వహించి ప్రజలకు పనులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని ప్రజాప్రతినిదులను, అధికారులను సూచించారు. ఉపాధి పనుల్లో 66 పనులు చేపట్టేలా గ్రామసభలో ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. గోరుమానుకొండ సర్పంచ్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ బీసీ బాలుర గురుకుల పాఠశాలకు ఆదర్శ పాఠశాలకు ప్రభుత్వ ఐటీ విద్యార్థులకు వేసవి కాలంలో తాగునీటి సమస్య రాకుండా నీటి సరఫరా చేసే విదంగా ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

హైవేపై పొంచి ఉన్న ప్రమాదం

ప్యాపిలి, ఆగస్టు 22: పట్టణ సమీపంలోని 44వ జాతీయ రహదారిపై ప్రమాదం పొంచి ఉంది. రోడ్డుపై గుంత ఏర్పడంతో ప్రమాదం జరిగే అవకాశం ఉంది. హైవేపై బెంగళూరు, హైదరాబాదు, కర్నూలు, అనం తపురం తదితర ప్రాంతాల నుంచి నిత్యం వందల సంఖ్యల వాహనాల రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే రోడ్డుపై గుంత ఏర్పడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదా రులు భయాందోళన చెందుతున్నారు.



రహదారిపై ఏర్పడిన గుంత

తొలగని మురుగు



ఎంఈవో కార్యాలయ ప్రాంగణంలో నిలిచివున్న మురుగునీరు

డోన్(రూరల్), ఆగస్టు 22: పట్టణంలోని మండల విద్యాధికారి కార్యాలయం ప్రాంగణంలో గత మూడు రోజులుగా మురుగునీరు నిలిచి దుర్గంధం వెదజల్లుతోంది. మండల విద్యాధికారి కార్యాలయ ప్రాంగణంలో ఉన్న బైపాస్ స్కూల్ విభిన్న ప్రతిభావంతులు అవస్థలు పడుతున్నారు. మండల విద్యాధికారి కార్యాలయ సిబ్బంది కూడా అవస్థలు పడుతు న్నారు. మున్సిపల్ అధికారులు సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

బాలికలకు వ్యాధి నిరోధక టీకాలు

చాగలమర్రి, ఆగస్టు 22: చాగలమర్రి గ్రామంలోని కేజీబీవీలో వ్యాధి నిరోధక టీకాలు వేసినట్లు సూపర్‌వైజర్ రామలింగారెడ్డి పేర్కొన్నారు. 6 నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థినులకు ధనుర్వాతం, డిఫ్తీరియా రాకుండా టీడీ వ్యాక్సిన్ వేసినట్లు పేర్కొన్నారు. 264 మంది బాలికలకు కంటి పరీక్షలు వైద్యులు రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించామని అన్నారు. 21 మంది బాలికలకు దృష్టిలోప సమస్య ఉన్నట్లు గుర్తించామన్నారు. వీరికి ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌వో సునీత, ఎంఎల్‌హెచ్‌పీ సమత, హెచ్ఈ లీలావతి, ఆశా వర్కర్లు పెద్దక్క, సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

కృష్ణాష్టమి పోస్టర్ల విడుదల

సంజామల, ఆగస్టు 22: మండలంలోని రామిరెడ్డిపల్లె గ్రామంలో జరిగే శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలకు సంబంధించి పోస్టర్లను గురువారం ఏఎస్ఐ నాగరాజు, రామకృష్ణా రెడ్డి ఆహ్వానపత్రికలు, పోస్టర్లను విడుదల చేశారు. రైతు సిద్ధాంతం ప్రబోధవ సేవా సమితి హిందూ జ్ఞానవేదిక కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 26 నుండి 29 వరకు శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు రాజశేఖర్, వెంకట సుబ్బయ్య తెలిపారు. గురు ప్రతాప్, గురు నాగేంద్ర, వెంకటరమణ, కిశోర్ పాల్గొన్నారు.

హెచ్ఐవీపై అవగాహన అవసరం

డోన్(రూరల్), ఆగస్టు 22: హెచ్ఐవీపై అవగాహన అవసరమని మున్సిపల్ శానిటైజర్ ఆఫీసర్ మహబూబ్ బాషా, హ్యాండ్స్ సంస్థ సీఈవో మధుకుమార్ అన్నారు. గురువారం పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయం ప్రాంగణంలో కార్మికులకు హెచ్ఐవీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హ్యాండ్స్ సంస్థ సభ్యులు సరస్వతి, షాజహాన్, సోఫియా, విజయలక్ష్మి, శాంతి పాల్గొన్నారు.

పంట నమోదు తప్పనిసరి

డోన్(రూరల్), ఆగస్టు 22: రైతులు పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి అబ్దుల్ షఫీ అన్నారు. గురువారం మండలంలోని చనుగొండ్ల, ఎద్దుపెంట గ్రామాల్లో పంట నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు.

రేవనూరు ఎస్ఐని కలిసిన టీడీపీ నాయకులు



ఎస్ఐకి పూలబొకే ఇస్తున్న టీడీపీ నాయకులు

కోవెలకుంట్ల, ఆగస్టు 22: రేవనూరు ఎస్ఐ భూపాలుడును గురువారం టీడీపీ నాయకులు కలిశారు. రేవనూరు పోలీసుస్టేషన్‌లో నూతన ఎస్ఐగా భూపాలుడు బాధ్యతలు చేపట్టారు. విషయం తెలుసుకున్న చిన్న కొప్పెర్ల గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు, మాజీ సర్పంచ్ బుచ్చన్న, వెంకట రమణారెడ్డి, బీసీ సంఘం జిల్లా నాయకులు లింగాలనాయుడు, గోవిందు, బాలరాజు స్టేషన్‌కు వెళ్లి ఎస్ఐని కలిసి అభినందనలు తెలిపారు.

బేతంచెర్ల: బేతంచెర్ల పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ అశోక్‌ను గురువారం ఎంఎస్ఎఫ్ నంద్యాల జిల్లా అధ్యక్షుడు అనిల్ మాదిగ, ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు శేషు మాదిగ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు

బేతంచెర్ల, ఆగస్టు 22: కోల్‌కత్తాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని కళాశాల విద్యార్థులు సంఘాల నాయకులతో కలిసి పాతబస్టాండు వరకు ర్యాలీ నిర్వహించి అక్కడ మానవహారంగా ఏర్పాడ్డారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రమేష్ నాయక్, మండల కో కన్వీనర్ విజయలక్ష్మి, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఉదయ్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మధుశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

పనులు వేగవంతం చేయాలి: పీడీ

చాగలమర్రి, ఆగస్టు 22: జిల్లాలో వంద రోజుల్లో గృహాల పనులు వేగవంతం చేసేలా యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని హౌసింగ్ పీడీ వెంకటసుబ్బయ్య తెలిపారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో మహబూబ్‌దౌల ఆధ్వర్యంలో హౌసింగ్ సిబ్బంది, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు, ఉపాధి సిబ్బందిచే సమీక్షా సమావేశం నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ ఇళ్ల పూర్తి చేసిన ప్రతి లబ్ధిదారుడికి ఉపాధిహామీ ద్వారా 90 రోజుల పనిదినాలకు సంబంధించిన బిల్లులను వారి ఖాతాలో జమ చేసేలా ప్రణాళిక తయారు చేయాలని అన్నారు. డిసెంబరు నాటికి బేస్‌మెంట్, రూఫ్ లేవెల్‌లో ఉన్న గృహాలను పూర్తి చేసేలా చూడాలని అన్నారు. లబ్ధిదారులు గృహాలు నిర్మించుకునేలా వారికి అవగాహన కల్పించి పనులు వేగవంతం చేయాలని అన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ డీఈ నాగరాజు, షఫివుల్లా, ఏపీవో నిర్మల పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ వెంకటసుబ్బయ్య

'గ్రామసభలను సద్వినియోగం చేసుకోండి'

ఉయ్యాలవాడ, ఆగస్టు 22: మండలంలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం జరిగే గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో ఉమామహేశ్వరరావు సూచించారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ నిధులతో జరిగే పనులకు గ్రామసభ ఆమోదం తెలపాలన్నారు. దీనిలో భాగంగా గ్రామాల్లో సీసీ రోడ్లు, మురుగు కాలువలు, వ్యవసాయ పనులు, గృహనిర్మాణాలు తదితర అంశాలపై చర్చించి తీర్మాణించాలన్నారు. ఆయా గ్రామాలకు కేటాయించిన సమయాల్లో ఆ గ్రామ ప్రత్యేక అధికారుల సమక్షంలో ఈ గ్రామ సభలు జరుగుతాయన్నారు.

బనగానపల్లె: మండలంలోని టంగుటూరు గ్రామంలో శుక్రవారం నిర్వహించే గ్రామ సభలో రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పాల్గొంటున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు పీపీ కుమార్‌రెడ్డి గురువారం తెలిపారు. ఈ సభకు సంబంధిత అధికారులతోపాటు ఎన్‌డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు.

కొలిమిగుండ్ల: మండలంలోని గ్రామ పంచాయతీల్లో శుక్రవారం గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ప్రసాదరెడ్డి గురువారం తెలిపారు. మొత్తం 23 గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక అధికారులను నియమించి గ్రామ సభలను నిర్వహిస్తున్నామని, ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు గ్రామ సభలకు హాజరు కావాలని కోరారు. ఉపాధి పనుల గుర్తింపు, తీర్మానాలపై చర్చించనున్నట్లు ఎంపీడీవో తెలిపారు.

కోవెలకుంట్ల: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో శుక్రవారం గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సయ్యదున్నీసా తెలిపారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఉదయం 10గంటలకు గ్రామసభలు నిర్వహిస్తామని తెలిపారు.

మండల ప్రత్యేకాధికారిగా సునీల్

ఉయ్యాలవాడ, ఆగస్టు 22: ఉయ్యాలవాడ మండల ప్రత్యేక అధికారిగా జిల్లా మైనారిటీ సంక్షేమశాఖ అధికారి సునీల్ నియమితులు అయినట్లు ఎంపీడీవో ఉమామహేశ్వరరావు గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ శుక్రవారం ఉయ్యాలవాడలో జరిగే గ్రామసభకు మండల ప్రత్యేక అధికారి హాజరవుతారని చెప్పారు. ఈ సభకు అన్ని శాఖల అధికారులు హాజరు కావ్వాలని ఎంపీడీవో కోరారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి

ఆళ్లగడ్డ, ఆగస్టు 22: ఆళ్లగడ్డ పట్టణంలోని సెయింట్ అనాస్ పాఠశాల వద్ద గురువారం గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెందాడని పట్టణ ఎస్ఐ నగీనా తెలిపారు. మృతుని వయస్సు 65ఏళ్లు ఉంటుందని, శరీరంపై చారలతో ఉన్న చొక్కా, తెల్లని పంచ, మాసిన తెల్లగడ్డం ఉందని చెప్పారు. వివరాలు తెలిసిన వారు పట్టణ పోలీస్‌స్టేషన్‌కు 9121101165 నంబరుకు తెలియజేయాలని ఆమె తెలిపారు.

నలుగురిపై కేసు నమోదు

రుద్రవరం, ఆగస్టు 22: మండలంలోని నరసాపురం గ్రామంలో మొక్కజొన్న పంటల్లో కోతుల విషయంలో ఘర్షణ పడిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వర ప్రసాద్ గురువారం తెలిపారు. రమేశ్‌బాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అదే గ్రామానికి చెందిన జరిమయ్య మరో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మద్యం పట్టివేత

చాగలమర్రి, ఆగస్టు 22: చాగలమర్రి గ్రామంలోని మల్లేవేముల బస్టాండు రహదారిలో అక్రమంగా తరలిస్తున్న 100 మద్యం బాటిళ్లను పట్టుకున్నట్లు ఎస్ఐ రమేష్‌రెడ్డి గురువారం తెలిపారు. గ్రామానికి నూరుల్లా అనే వ్యక్తి వివిధ దుకాణాల్లో బాటిళ్లను కొనుగోలు చేసి అధిక ధరలకు విక్రయించుకునేందుకు తీసుకెళ్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. బాటిళ్లను సీజ్ చేసి వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బనగానపల్లె: మండలంలోని నందివర్గంలో గద్దల సుబ్బారావు అనే వ్యక్తి మద్యం సీసాలు అమ్ముతుండగా పట్టుకున్నట్లు నందివర్గం ఎస్ఐ వెంకటసుబ్బయ్య గురువారం తెలిపారు. అతని వద్ద మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి రిమాం డ్‌కు తరలిం చినట్లు ఎస్ఐ తెలిపారు.

కొలిమిగుండ్ల: మండలంలోని తుమ్మలపెంట గ్రామ సమీపంలో అల్ట్రాటెక్ సిమెంట్ పరిశ్రమ 8వ గేట్ వద్ద యాతం పెద్దిరెడ్డి అనే వ్యక్తి కర్ణాటక మద్యం విక్రయిస్తుండగా అరెస్టు చేసినట్లు సీఐ రమేష్‌బాబు తెలిపారు. అతని నుంచి 113 మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. మండలంలోని గ్రామాల్లో నాటుసారా, మట్కా, పేకాట వంటి అసాంఘిక చర్యలకు పాల్పడితే చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

సంజామల, ఆగస్టు 22: పేరుసోమలలో పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ రమణయ్య గురువారం తెలిపారు. గ్రామంలోని ఎస్సీ కాలనీ చర్చి వద్ద పేకాట ఆడుతున్న సమాచారంతో సిబ్బందితో దాడులు నిర్వహించి ఐదుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.2700 నగదును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

శతావధానంలో తెలుగు కవులు



శతావధానంలో పాల్గొన్న తెలుగు కవులు

రుద్రవరం, ఆగస్టు 22: కర్ణాటక రాష్ట్రం బళ్లారిలోని దివ్యక్షేత్రం హరిహరపురం ఆదిశంకరాచార్య శారదలక్ష్మీనరసింహస్వామి పీఠంలో గురువారం నిర్వహించిన శతావధానం కార్యక్రమంలో తెలుగు కవులు పాల్గొన్నారు. కమల మాధవరావు, వెంకోబరావు, డాక్టర్ వెంకటరమణమూర్తి పాల్గొని తమ వంతు తెలుగు పద్యాలను వినిపించారు. అవధాన కార్యక్రమంలో నరసాపురం, ఆళ్లగడ్డ నుంచి పాల్గొన్నారు. తెలుగువారిని ఆ పీఠం వారు శాలువాతో సన్మానించారు.

ఎస్‌బీఐ బ్రాంచ్‌ను ఏర్పాటు చేయాలి

డోన్(రూరల్), ఆగస్టు 22: డోన్ పట్టణంలోని కొత్తపేట ప్రధాన రోడ్డులో అదనంగా స్టేట్ బ్యాంకు బ్రాంచ్‌ను ఏర్పాటు చేయాలని జాతీ య బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఏఈ నాగరాజు డిమాండ్ చేశారు. గురువారం డోన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ డోన్ పట్టణం కొండపేట ప్రాంతంలో 10వేలకు పైగా జనాభా ఉందన్నారు. కొండపేట ప్రధాన రోడ్ల మీదుగా చుట్టుప క్కల సమీప గ్రామాలు 30కి పైగా ఉన్నాయన్నారు. కొండపేట ప్రధాన రోడ్డులో స్టేట్ బ్యాంకు ప్రత్యేక బ్రాంచ్‌ను ఏర్పాటు చేస్తే ప్రజలకు మరిం త సౌకర్యంగా ఉంటుందన్నారు.

'ఉద్యాన పంటలతో లాభాలు'

రుద్రవరం, ఆగస్టు 22: ఉద్యాన పంటలు సాగు చేసిన రైతులే వ్యాపారులని, మంచి లాభాలు వస్తాయని జిల్లా ఉద్యానశాఖాధికారి నాగరాజు అన్నారు. గురువారం రుద్రవరం వ్యవసాయ కార్యాలయంలో ఉద్యానశాఖాధికారి ఉత్పత్తిదారుల సంఘం డైరెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. ఉద్యాన పంటలు పండించిన రైతులే వ్యాపారులుగా తమ పంటలను విస్తరించుకోవడం సులభతరమన్నారు. ఉద్యాన శాఖాధికారి శ్రీధర్, ఏవో శ్రీకృష్ణ, ఏఈవో రాజు పాల్గొన్నారు.

పాఠశాలల తనిఖీ

చాగలమర్రి, ఆగస్టు 22: చాగలమర్రి గ్రామంలోని గిరిజన కాలనీలో ప్రాథమిక పాఠశాలను ఎంఈవో అనూరాధ, పాతబస్టాండులోని ప్రాథమిక పాఠశాలను ఎంఈవో-2 న్యామతుల్ల గురువారం తనిఖీ చేశారు. ఆయా పాఠశాలల్లో సంబంధిత రికార్డులను, విద్యార్థుల గ్రేడింగ్‌ను పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. హెచ్ఎంలు నారాయణరెడ్డి, మౌలాలి, సీఆర్పీలు పాల్గొన్నారు.

ఘనంగా సద్గురు లక్ష్మయ్య ఆరాధనోత్సవాలు

డోన్(రూరల్), ఆగస్టు 22: మండలంలోని చింతలపేట గ్రామంలో సద్గురు లక్ష్మయ్యస్వామి 34వ ఆరాధనోత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. చింతలపేట గ్రామ ప్రధాన రోడ్డులోని పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో సద్గురు రంగస్వామి ఆధ్వర్యంలో ఆరాధనోత్సవాలు జరిగాయి. ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

'ప్రతి ఒక్కరూ మొక్క నాటాలి'



మొక్క నాటుతున్న ఎంపీడీవో, ఏపీవో

ఉయ్యాలవాడ, ఆగస్టు 22: ప్రతి ఒక్కరూ మొక్క నాటి సంరక్షించాలని ఎంపీడీవో ఉమమహేశ్వరరావు తెలిపారు. ఈ మొక్క అమ్మ పేరు కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక ముస్లింల స్మశాన వాటికలో కొబ్బరి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఉపాధి ఏపీవో రవిప్రకాష్ మాట్లాడుతూ మండలంలో వంద ఎకరాల్లో కొబ్బరి, మామిడి మొక్కలు నాటుతున్నామన్నారు. ఉయ్యాలవాడలోని ముస్లిం శ్మశాన వాటికలో 70 కొబ్బరి మొక్కలు నాటామన్నారు. కార్యక్రమంలో ఈసీ షరీఫ్, టీఏలు ఉన్నారు.